

# బాల వికాసం

# బాలవర్ధన్

**ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల**

(ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)

**ప్రసిద్ధ బాలల రచయిత డా॥ వి.ఆర్.శర్మ కలం నుండి జాలువారిన ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల 'బాలవర్ధన్'. ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...**

-సంపాదకులు

3

జానపద ప్రపంచంలో బుర్రకథగా ప్రారంభమై, కథగా మారి తరతరాలుగా మనకు అందివస్తున్న అపూర్వ సాహిత్య, సాంస్కృతిక వారసత్వ సంపద బాలనాగమ్మ కథ. ఇది సుమారు ఎనభై ఏళ్ళ కిందటే సినీమాగా వచ్చింది. ఊరూరా నాటకాలుగా ప్రదర్శింపబడింది. ఇప్పుడు ఆరవ తరగతిలో పాఠ్యాంశంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పిల్లల సినీమా 'హారిపోటర్'కూ బాలనాగమ్మ కథకూ ఎన్నో దగ్గరి పోలికలు నాకు కనబడ్డాయి. మారిన కాలమాన పరిస్థితులలో, ఆనాటి ఆకథ ప్రేరణతో ఈనాటి టీనేజీ పిల్లలకోసం నేను కల్పించి రాసిన బాలవర్ధన్ కథ ఇది. అది తల్లి తరం కథ అయితే ఇది నేటి కొడుకు తరం కథ. ఈ కథను నేను మార్చిలో మొదలు పెట్టి, మేలో పూర్తి చేశాను. అందుకే ఈనాటి పరిస్థితులు దీనిలో కనిపిస్తాయి. ఈనాటి పిల్లలకూ, తరువాత పెద్దలకూ నచ్చేలా ఉండడానికి, సహజత్వానికి దగ్గరగా అనిపించేలా రాయడానికి ప్రయత్నం చేశాను. ఇది బాగుందనిపిస్తే ఆ గొప్పదనమంతా నా ఈరచనకు ప్రేరణనిచ్చిన మన బాలనాగమ్మ కథది. బాలనాగమ్మ కథను సృష్టించిన ఆ అజ్ఞాత జానపద రచయితలకూ, తరతరాలుగా నిలబెట్టిన జానపద కళాకారులకూ దీన్ని అంకితం చేస్తున్నాను. నా ఈ ప్రయత్నం మీద మీ అమూల్యమైన అభిప్రాయాలను కోరుతున్నాను.

-వి.ఆర్.శర్మ

(గత సంచిక తరువాయి)

భార్య మరణించిన బాధ ఒకవైపు, తల్లి లేని పిల్లల ఆలనా పాలనా మరొక వైపు నవకమల్‌ను బాగా కుంగదీసాయి. పిల్లలతోనే పూర్తి సమయం గడుపుతున్నాడు. గ్రామ సర్పంచ్‌గా తన పనులు చేయడం లేదు. ఇతర ప్రపంచంతో సంబంధం పూర్తిగా మానుకున్నాడు. అలా కొన్ని నెలలు గడిచాయి. ఆ పిల్లలకొక తల్లి కావాలని, అందుకోసమైనా మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని అతణ్ణి ఒప్పించే ప్రయత్నం చేసారు అతని స్నేహితులూ, బంధువులు. చివరకు ఆ పిల్లలతోనే ఆ మాటలు పదే పదే బలంగా చెప్పించారు. పిల్లలకు మళ్ళీ తల్లి దొరుకుతుందనే భావంతో అతడు చివరికి అందుకు అంగీకరించాడు. మాణిక్యవల్లి అనే స్త్రీతో అతని పెళ్ళి జరిగింది.

ఆపెళ్ళి జరిగిన తరువాత కూడా అతడు తన పిల్లలతోనే పూర్తి సమయం గడుపుతున్నాడు. అది మాణిక్యల్లో వల్లికి నచ్చలేదు. ఏదో చేయాలనే ఆలోచనలో పడింది ఆమె.

ఇది ఇలా ఉండగా ఉత్తర తెలంగాణకు చెందిన సర్పంచులందరూ హైదరాబాద్ రావాలని ప్రభుత్వం నుంచి పిలుపు అందింది. మూడు రోజులపాటు జరిగే ఆ సమావేశాల్లో ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొంటారని, కనుక తప్పనిసరిగా అందరూ రావాలని ప్రభుత్వ ఆదేశాల సారాంశం అది.

తప్పనిసరై నవకమల్ తన బిడ్డలను మాణిక్యవల్లికి అప్పగించి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్ళాడు. 'పిల్లలను కంటికి రెప్పలా కాపాడుతానని, మీరు నిశ్చింతగా వెళ్ళిరమ్మని' చెప్పి పంపింది మాణిక్యవల్లి.

నవకమల్ హైదరాబాద్‌కు వెళ్ళగానే మాణిక్యవల్లి ఆ పిల్లలను కసురుకోవడం, తిట్టడం, కొట్టడం కూడా మొదలు పెట్టింది. తిండి కూడా సరిగ్గా తిననీయకుండా, ఆడుకోనీయకుండా ఆంక్షలు మొదలు పెట్టింది. పిల్లలు ఆమె ప్రవర్తనను అర్థం చేసుకోలేక ఇబ్బంది పడసాగారు. మూడవ రోజు ఆపిల్లలకు నిద్రపోయే ట్యాబ్లెట్లు కలిపిన పాలు తాగించింది. నిద్ర పోయిన తరువాత రహస్యంగా వాళ్ళను తీసుకుపోయి పడమటి వైపు అడవి అంచున ఉన్న పాడుబడ్డ దయ్యాల శిథిల గృహంలో పడుకోబెట్టించి తాళం వేయించింది. అటువైపు ఎవరూ వెళ్ళరు. కనుక ఆ పిల్లలు ఏమైపోయారో ఎవరికీ తెలియదని భావించింది. భర్త వచ్చిన తరువాత 'తాను ఎంత చెప్పినా వినకుండా పిల్లలు తమ స్నేహితులతో ఆడుకుంటామని ఎటో వెళ్ళిపోయారని, వాళ్ళ ఏమైపోయారోనని' ఏడుస్తూ చెప్పి నమ్మించాలని ఆలోచన చేసింది.

మూడు రోజులు అనుకున్న హైదరాబాద్ సమావేశాల కార్యక్రమం మూడోరోజు జరుగకుండా వాయిదా పడడం వల్ల ఆరోజే సాయంత్రం నవకమల్ తమ ఊరికి తిరిగి వచ్చేశాడు.

రాగానే తన బిడ్డల గురించి చూస్తే వాళ్ళు కనిపించలేదు. మాణిక్యవల్లి ఎంతో బాధ నటిస్తూ 'తాను ఎంత చెప్పినా వినకుండా వాళ్ళు తమ స్నేహితుల ఇంటికి వెళ్ళి ఆడుకుంటా మని వెళ్ళారని, వద్దని తాను వారించినా వినలేదని' చెప్పింది. "ఎంతయినా కన్న తల్లిని కాదుగదా!" అంటూ తనను వాళ్ళు దూరం పెట్టినందుకు కన్నీరు కార్చింది. నవకమల్ కోపంతో, ఆందోళనతో పిల్లల గురించి వాళ్ళస్నేహితులను అడగడానికి బయలు దేరాడు.

అతడు ఇల్లు దాటగానే అక్కడే అతడికోసం ఎదురు చూస్తున్న యశోదమ్మ అతణ్ణి ఆపింది. ఓ పక్కకు తీసుకెళ్ళింది. యశోదమ్మ ఎన్నో ఏళ్ళుగా ఆ ఇంట్లో నమ్మకంగా పని చేస్తున్న మనిషి. నవకమల్‌ను తన కొడుకులా భావిస్తుంది. ఆమె

> **కలప స్మగ్లింగ్ చేసేవాళ్ళనూ, జంతువులను వేటాడే వాళ్ళనూ, నియంత్రించాడు. అడవికీ, అడవిలోని జంతువులకూ, అక్కడి గిరిజనులకూ అతడో నమ్మకమైన రక్షకుడైనాడు**

జరిగిన విషయాలన్నీ నవకమల్‌కు చెప్పింది. ఆ పిల్లలను ఊరి చివర అడవిలో ఉన్న పాడుబడ్డ పురాతనమైన దయ్యాల శిథిల గృహంలో విడిచి పెట్టిన సంగతి చెప్పింది.

నవకమల్‌కు భరించలేనంత కోపం వచ్చింది. కానీ దాన్ని ప్రదర్శిస్తే తన బిడ్డలకు మరింత నష్టం కలుగ వచ్చుని కోపాన్ని దిగమింగి, వెళ్ళి తన బిడ్డలను తెచ్చుకున్నాడు.

ఏమైందో తెలియదు, ఎలా జరిగిందో తెలియదు. కొద్ది రోజుల్లోనే నవకమల్ ఆరోగ్యం క్షీణించింది. ఎప్పుడూ మత్తుగా కనబడుతున్నాడు. నిలబడలేక తూలిపోతున్నాడు. మాటలు ముద్ద ముద్దగా, అర్థం కాకుండా మాట్లాడుతున్నాడు.

దయానంద్ ఆ సమయానికి మిత్రునికి అందుబాటులో లేకుండాపోయాడు. హైదరాబాద్‌లో ప్రాక్టీస్ చేస్తూ ఈ మధ్యనే అక్కడికి వెళ్ళిపోయాడు.

నవకమల్‌కు తన తమ్ముడితో ఏదో నాటువైద్యం చేయించసాగింది మాణిక్యవల్లి. ఎవర్నీ కలవనిచ్చేది కాదు. ఎవర్నీ చూడనిచ్చేది కాదు. నవకమల్ ఆమె ఎలా చెపితే అలా నడుచుకునేవాడు. ఏం చెబితే అది వినేవాడు. ఆమె మాటకు భయపడేవాడు. ఇప్పుడు పిల్లలకన్నా మాణిక్యవల్లే అతనికి ముఖ్యమై పోయింది. పిల్లల్ని కసురుకోవడం, బెదిరించడం, చివరికి కొట్టడం కూడా తన కళ్ళ ముందే జరుగుతున్నా మాణిక్యవల్లిని ఏమనేవాడు కాదు. తాను ఈ లోకంలో లేనట్టు, ఆ పిల్లలెవరో తనకు తెలియనట్టు ఉండేవాడు.

కొందరు ఆమె ఏదో చేతబడి చేయించిందని అన్నారు. ఏదో మరగు మందు పెట్టిందని కొందరు చెప్పుకున్నారు. అతనికి మత్తు మందులు అలవాటు చేసిందని మరికొందరు గుసగుస లాడుకున్నారు.

పాత పని వాళ్ళందరినీ ఆమె మానిపించి పంపించేసింది. తన తమ్ముడు ఎక్కడ్నుంచో మాట్లాడి తెచ్చిన వాళ్ళు ఆయింట్లో ఇప్పుడు పనిచేస్తున్నారు. ఆ పిల్లలు అనాథల్లా తయారయ్యారు.

వీటన్నిటి పరాకాష్టగా ఓరోజు రాత్రి ఆ పిల్లల్ని కాళ్ళూ, చేతులూ కట్టేసి, పులులు తిరిగే అడవి మధ్యన వదలేసి రమ్మని ఓ ఇద్దరు మనుషుల్ని పంపించింది. వాళ్ళు ఆ పిల్లల్ని కాళ్ళుచేతులూ కట్టేసి, కారులో వేసుకొని రాత్రి పూట బయల్దేరారు. చక్రపురానికి ఉత్తరం వైపు అడవిలో నుంచి వెళ్ళే ఓసన్నటి అడవి బాట ఒకటి ముప్పై కిలోమీటర్లు వెళ్ళి, చివరకు ఆదిలాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్ళే రహదారి పక్కన ముగుస్తుంది. సాధారణంగా ఆ మార్గంలో జనం ఎవరూ వెళ్ళరు. పిల్లలను ఆ మార్గంలో ఓ పది కిలోమీటర్లు తీసుకొని పోయి, దట్టంగా చెట్లున్న ఓ చోట వాళ్ళను దించారు. వాళ్ళను ఆ చెట్ల నడుమ ఓమడుగులో పారేసి వెళ్ళాలని వాళ్ళు అనుకున్నారు.




కానీ వాళ్ళు పిల్లల్ని దించగానే, దూరంగా ఏదో వాహనం వస్తున్నట్టుగా హెడ్‌లైట్ల కాంతి కనిపించింది. అది వాళ్ళు వచ్చిన తోవలో వెనుక వైపునుంచి వస్తున్నది. అటవీశాఖ అధికారులో, వాళ్ళ కోసం వెతుకుతున్న పోలీసులో అని వాళ్ళు కంగారు పడ్డారు. పిల్లల్ని అక్కడే వదిలేసి పారిపోయారు.



వీళ్ళ వాహనానికి వెనుక వచ్చింది ఓ అటవీ శాఖ అధికారికి చెందిన జీపు. అందులోంచి ముగ్గురు అటవీశాఖ పోలీసులూ, ఓ అధికారీ దిగారు. ఆ ప్రాంతానికి కొత్తగా బదిలీపై వచ్చిన అధికారి ఆనంద్ కులకర్ణి. సమర్థుడైన అధికారిగా పేరున్నవాడు. అతడు వచ్చిన తరువాత అంతవరకు ఆ అడవి కేంద్రంగా కొనసాగిన అసాంఘిక కార్యక్రమాలన్నీ ఆగిపోయాయి. కలప స్మగ్లింగ్ చేసేవాళ్ళనూ, జంతువులను వేటాడే వాళ్ళనూ, నియంత్రించాడు. అడవికీ, అడవిలోని జంతువులకూ, అక్కడి గిరిజనులకూ అతడో నమ్మకమైన రక్షకుడైనాడు. రాత్రుళ్ళు అడవిలో తరచుగా అలా స్వయంగా తిరిగి పర్యవేక్షించడం అతని అలవాటు.

అలా తిరుగుతున్న సమయంలో అర్థరాత్రి వేళ కనిపించిన ఆ వాహనాన్ని వెంబడిస్తూ వస్తున్నాడు. దూరంగా వేగంగా వెళుతున్న ఆ కారును దృష్టిలోంచి తప్పించుకోనివ్వ కూడదని డ్రైవరుకు చెప్తున్నాడు. ఇంతలో ఆ చీకట్లో తోవపక్కన, చెట్ల నీడల్లో నిలబడ్డ పిల్లల మీద వాళ్ళ జీపు లైట్ల వెలుతురు పడింది కొద్ది క్షణాలు.

"సర్ అక్కడ ఎవరో ఇద్దరు పిల్లలు ఉన్నారు" చెప్పాడు డ్రైవర్. "చూసాను. అక్కడ ఆపి చూడు, ఇంజన్ ఆపొద్దు. మీరు పొజిషన్‌లో ఉండండి!" అని తన వెంట ఉన్న సెక్యూరిటీవాళ్ళతో చెప్పి ముందుకు చూస్తూ, చుట్టూ పరిశీలించాడు. ఇంకా ఎవరైనా ఉన్నారేమోనని.

ఇంతలో వాళ్ళ వాహనం ఆ పిల్లలున్న చోటికి చేరుకుంది. హెడ్‌లైట్ల వెలుతురులో స్పష్టంగా కనిపిస్తున్నారు వాళ్ళు. సుమారు నాలుగేళ్ళపిల్లల్లా ఉన్నారిద్దరు. వాళ్ళ చేతులు వెనక్కి కట్టేసి ఉన్నాయి. నోటికి అడ్డంగా బట్టతో కట్టేసి ఉన్నారు. వాళ్ళ మొఖాల్లో భయం కనబడుతోంది. జీపులోంచి పోలీసులు తుపాకులతో దిగడం చూసి మరింత బెదిరిపోయారు ఆ పిల్లలు. అటూ, ఇటూ పరిశీలిస్తూ చేతిలోని టార్చ్‌లైట్ వెలిగించి, చుట్టూ తిప్పి చూసాడు కులకర్ణి. ఎవరూ లేరని నిర్ధారించుకొన్నాడు. ఆ ప్రాంతంలో భయంకరమైన నిశ్శబ్దం వ్యాపించి ఉంది

మెల్లగా వెళ్ళి, పిల్లల నోళ్ళకు అడ్డం గా ఉన్న కట్లని తొలగిస్తూ, మృదువుగా "భయపడకండి బేటా! నేను ఇక్కడి అడవికి అధికారిని. వీళ్ళు మనవాళ్ళే" అంటూ పోలీసుల్ని చూపుతూ చెప్పాడు. "గట్టిగా అరవబోయిన ఆ పిల్లలు అతని మాటలు విని, అరవకుండా ఏడుపు మొహాలతో "అంకుల్...మాచేతులు విప్పేస్తారా!" అని అడిగారు తమ చెతుల్ని కదిలించే ప్రయత్నం చేస్తూ.

"ఇదిగో... అంటూ వాళ్ళ చేతి కట్లను విప్పి, పదండి ముందు ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం. ఇది ప్రమాదకరమైన చోటు." అంటూ వాళ్ళను జీపు ఎక్కించాడు. తరువాత ఎస్కార్టు పోలీసులు ఎక్కారు. జీపు వెనక్కి తిరిగి బయల్దేరింది.

"ఇప్పుడు చెప్పండి! ఎవరు మీరు? మిమ్మల్ని ఇక్కడికి ఎవరు తెచ్చారు? అన్నీ వివరంగా చెప్పండి" అంటూ నీళ్ళ బాటిల్ మూత తెరిచి వాళ్ళకు బాటిల్ అందించాడు కులకర్ణి.

నాగరత్న, నాగమణి తమ కథను చెప్పడం మొదలుపెట్టారు.

వాళ్ళు చెప్పిన విషయాలు విన్న తరువాత కులకర్ణి మనసు కోపం తోనూ, బాధతోనూ నిండిపోయింది. ఆ రాత్రి అతడు ఆ పిల్లల్ని తన ఇంటికే తీసుకెళ్ళాడు.

6

ఆదిలాబాద్ నగరపు పడమటి దిక్కున అతని బంగళా ఉంది. అతని తండ్రి ద్వారా వచ్చిన స్థిరాస్తి అది. అతని తండ్రి పట్వారీగా ఆ ప్రాంతపు రెవెన్యూ పనులు చూసే వాడు. కులకర్ణి మాత్రం తనకు అడవి అంటే, ప్రకృతి అంటే ఉన్న ఇష్టంతో ఆ శాఖలోనే ఉద్యోగం సంపాదించుకున్నాడు. తరువాత ప్రభుత్వం పటేల్, పట్వారీల వ్యవస్థ రద్దు చేసింది.

ముసలి వాళ్ళయిన తల్లిదండ్రులతో తానూ, తన భార్యా కలిసి అదే పాతకాలపు బంగ్లాలో ఉంటున్నాడు కులకర్ణి. అవసరమైన మరమ్మత్తులు, మార్పులు, చేర్పులు చేయించి విశాలమైన ఆ బంగళా చుట్టూ కాంపౌండు గోడ కట్టించాడు. ఆ కాంపౌండు గోడ దాటితే ఆ ఆవరణలో అనేక రకాల పూల మొక్కలు, చెట్లు, అందమైన వచ్చటి లానులు కనిపిస్తాయి. మెయిన్‌గేటు నుంచి ఇంట్లోకి వెళ్ళే మార్గంలో షాబాదు రాళ్ళతో పరిచిన ఓ అందమైన కాలిబాట. బంగళాకు కూడా ముందు గ్రిల్ దర్వాజాలు, వాటివెనుక టేకుతో చేసిన బలమైన తలుపులు ఉన్నాయి. కాంపౌండు లోపల సింహాల్లాంటి రెండు పెంపుడు కుక్కలు, అనుమతి లేకుండా లోనికి ప్రవేశించడం సాధ్యంకాని ఓ పటిష్టమైన కోటలా ఉంటుందది.

ఆ పిల్లలు కులకర్ణిని పూర్తిగా నమ్మారు. నిశ్చింతంగా ఆ రాత్రి నిద్రపోయారు. మర్నాడు పొద్దున కులకర్ణి పదింటికల్లా యశోదమ్మను మాట్లాడాలని కారు పంపించి తన ఇంటికి పిలిపించాడు. ఆమె పిల్లల్ని ప్రాణాలతో చూసి ఎంతో సంతోషపడ్డది. 'మళ్ళీ ఆ పిల్లల్ని అక్కడికి పంపిస్తే వాళ్ళు బతకరని, దయచేసి వాళ్ళకు మరేదైనా మార్గం చూస్తే పుణ్యం ఉంటుందని' బతిమాలింది. అక్కడి విషయాలన్నీ ఆమె చెప్తుంటే విన్న తరువాత కులకర్ణికి కూడా వాళ్ళను అక్కడికి పంపడం సరికాదనిపించింది. పిల్లలు కూడా "మేం ఇక అక్కడికి వెళ్ళం" అని చెప్పారు. 'సరే మరో వారం తరువాత ఆలోచిద్దాం' అని, అప్పటి వరకు ఆ పిల్లల్ని తన ఇంట్లోనే ఉంచి, తన తల్లిదండ్రులకు వాళ్ళను అప్పగించాడు. వాళ్ళకు ఆ పిల్లలు ముద్దుల మనుమరాళ్ళుగా మారిపోయారు. కులకర్ణి భార్య కూడా తమకు పిల్లలు లేని లోటు ఇలా తీరిందని సంబరపడింది.

వారం తిరగకుండానే నవకమల్ మతి భ్రమించి పిచ్చివాడై పోయాడని, హఠాత్తుగా మరణించాడని వార్త అందింది. మాణిక్యవల్లి మీద ఆ ఊరి ప్రజలు దాడి చేయడానికి వెళితే ఆమె భయంతో ఇంటిని తగలబెట్టిందని, ఆమెకూడా ఆ మంటల్లోనే చనిపోయిందని మరో వార్త తెలిసింది. ఆ పిల్లలకు ఈ విషయాలు చాలా కాలం వరకు తెలియనివ్వలేదు కులకర్ణి. కాలి బూడిదైన ఆ ఇంటి పరిసరాల్లో దయ్యాలు తిరుగుతున్నాయనే ప్రచారం ఒకటి జరిగింది.

పిల్లలకు పద్దెనిమిదేళ్ళు నిండాయి. వాళ్ళు కులకర్ణి, అతని భార్య రేణుకలను తమ అమ్మానాన్నలుగా భావించుకున్నారు. కొంత కాలానికి కులకర్ణి తల్లిదండ్రులు మరణించారు. నాగరత్న, నాగమణి ఇద్దరూ పుత్తడి బొమ్మల్లా కనిపిస్తున్నారు. వాళ్ళిద్దరూ ఇంటర్ పూర్తి చేసి డిగ్రీలో చేరారు.

ఓ రోజు కులకర్ణి చెల్లెలు పద్మ వచ్చింది, అన్నతో మాట్లాడే పని ఉందని. పద్మ భర్త ఓ లెక్చరర్‌గా కామారెడ్డి డిగ్రీ కాలేజీలో పనిచేస్తున్నాడు. వాళ్ళు కామారెడ్డి జిల్లా కేంద్రానికి దగ్గర లో ఉన్న 'వానకొండ' అనే ఊళ్ళో ఉంటున్నారు. వాళ్ళకు ఇద్దరు కొడుకులున్నారు, వాళ్ళు కవల పిల్లలు. వాళ్ళకు ఇరవయ్యేళ్ళ వయసొచ్చింది.

పద్మ సంవత్సరానికి ఓ రెండు, మూడు సార్లు తప్పకుండా తన అన్నా వదినెల ఇంటికి వచ్చి వెళ్తుంది. ఆమె అంటే వాళ్ళకు కూడా ఎంతో ప్రేమా, ఆత్మీయతా ఉన్నాయి. కులకర్ణి తన చెల్లెలిమాట జవదాటడని అనుకుంటారు. నాగరత్న, నాగమణి కూడా పద్మను 'అత్తా' అని పిలుస్తూ ఆమెతో స్నేహంగా, చనువుగా ఉంటారు.

"అన్నా!...నేనొకటి అడిగితే కాదనొద్దు" అంటూ, సంభాషణ ప్రారంభంలోనే తన అన్న ముందరి కాళ్ళకు బంధం వేసింది పద్మ.

"సరే చెప్పు!" నవ్వుతూ అంగీకరించాడు కులకర్ణి.

అన్న చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని అలా పట్టుకొని, ముఖంలోకి చూస్తూ పద్మ తన కోరికను చెప్పింది

"నాగరత్న, నాగమణి నాకోడళ్ళుగా మా కుటుంబంలోకి రావాలని నా ఆశ!"

"చాలా మంచి కోరిక! కానీ వాళ్ళకు అభ్యంతరం లేకపోతేనే!"

"థాంక్యూ అన్నా! వాళ్ళను నేను అడుగుతాను. ముందు మీ అభిప్రాయం తీసుకొని, తరువాత వాళ్ళను అడగాలనుకున్నాను" సంతోషంగా అంది పద్మ.

"సరే, వాళ్ళతో వాళ్ళతో మాట్లాడు. నేను వదినతో చెప్తాను." అంటూ వంటింటి వైపు నడిచాడు కులకర్ణి.

నాగమణి నాగరత్న, సంతోషంగా అంగీకరించారు. మూడు మాసాలు తిరగకుండానే వాళ్ళ పెళ్ళి పద్మ కొడుకులు కార్యవర్ధన్, సూర్యవర్ధన్‌లతో జరిగింది. ఆ రెండు కుటుంబాలు సంతోష కెరటాల మీద అలా ఆనందంగా సంవత్సరం పాటు గడిపేసాయి. పెళ్ళయిన మూడో నెలకే వాళ్ళు తల్లులు కాబోతున్న వార్త ఆ కుటుంబాల్లో పండు వెన్నెల కాయించింది.

కానుపు కోసం వాళ్ళను ఏడో నెలలో కులకర్ణి దంపతులు ఆదిలాబాద్‌లోని తమ ఇంటికి తీసుకొని వచ్చారు. అక్కడ వాళ్ళు ఇద్దరు మొగ పిల్లలకు జన్మనిచ్చారు.

ఇరవై ఒకటవ రోజు బారసాల ఆ ఇంట్లో ఓ పెద్ద ఉత్సవంలా జరిగింది. ఆ పిల్లలకు బాలవర్ధన్, ఆర్యవర్ధన్ అనే పేర్లు పెట్టుకున్నారు.

ఆ పిల్లలే మీరు. నాగమణి, కార్యవర్ధన్‌లే మీ అమ్మానాన్నలు... నేను నీ కన్న తల్లిని కాదు. నీకు చిన్నమ్మను. నెమ్మదిగా చెప్తూ, పాలిపోయినట్టు విచారంగా మారిన మొహంతో, దు:ఖం నిండిన కళ్ళతో బాలవర్ధన్ మొహంలోకి చూస్తూ, మాట పెగలనట్టు చెప్పడం ఆపింది. అక్కడ కొద్దిసేపు గాఢమైన నిశ్శబ్దం కనపించని పొగలా అలుముకుంది.

"మరి మా అమ్మా నాన్నా ఎక్కడున్నారు?... వాళ్ళకేమయింది?" నాగరత్న చేతులు పట్టుకొని గట్టిగా ఊపుతూ ఆతృతగా, ఆందోళనగా అడిగాడు బాలవర్ధన్ రాజు .

మీ బారసాల జరిగిన నాలుగు రోజులకు మిమ్మల్ని తీసుకొని రావాలని మీనాన్న, చిన్నాన్న అనుకున్నారు. కానీ రెండో రోజునే వాళ్ళు మమ్మల్ని అక్కడే విడిచి, అత్యవసరంగా హైదరాబాద్ వెళ్ళవలసి వచ్చింది. నువ్వు పుట్టింది రెండు వేల నాలుగులో. అప్పటికి తెలంగాణ ఉద్యమం క్రమంగా బలమైన రాజకీయ ఉద్యమంగా రూపు దిద్దుకుంటున్నది. భవిష్యత్ కార్యాచరణ కోసం చర్చించుకోవడానికి రెండు మూడు రోజులుండేలా రమ్మని వీళ్ళకు ఉద్యమ నాయకత్వం నుంచి పిలుపు వచ్చింది. వీళ్ళు ఉద్యమాన్ని నడిపిస్తున్న వాళ్ళలో చాలా చురుకైన వాళ్ళు. కనుక వీళ్ళు తప్పనిసరిగా రావాలని చెప్పారు. కనుక వీళ్ళు వెళ్ళక తప్పలేదు.

ఒంటరిగా ఇల్లు కదలవద్దని మీ అమ్మకు అనేక జాగ్రత్తలు చెప్పాడు మీనాన్న. తనకు కుడిచేయిలా పని చేసేవాడు తన మిత్రుడు రాము. అతడు తానూ ఈ ఇంట్లో ఒకడిగా కలిసిపోయి ఉండే వాడు. మమ్మల్ని జాగ్రత్తగా

> **సుమారు నాలుగేళ్ళపిల్లల్లా ఉన్నారిద్దరు. వాళ్ళ చేతులు వెనక్కి కట్టేసి ఉన్నాయి. నోటికి అడ్డంగా బట్టతో కట్టేసి ఉన్నారు. వాళ్ళ మొఖాల్లో భయం కనబడుతోంది. జీపులోంచి పోలీసులు తుపాకులతో దిగడం చూసి మరింత బెదిరిపోయారు ఆ పిల్లలు.**

కనిపెట్టుకొని ఉండే బాధ్యతను రాముకు ప్రత్యేకంగా అప్పగించి, వాళ్ళు హైదరాబాద్ వెళ్ళిపోయారు.

మీ తాతయ్య కులకర్ణి గారు 'తాను మమ్మల్ని స్వయంగా దిగబెడతానని, మీరు నిశ్చింతగా వెళ్ళి రమ్మని' చెప్పారు వాళ్ళతో.

ఇంకో రెండు రోజులు గడిస్తే మేమంతా ఇక్కడికి బయలుదేరే వాళ్ళమే. కానీ వాళ్ళు వెళ్ళిన మరుసటి రోజే మన కుటుంబాల్లో గాఢాంధకారం నిండిపోయింది. భయంకరమైన తుఫాను చెలరేగి, మన కుటుంబాలను అల్లకల్లోలం చేసింది.

"ఏమైందమ్మా?..ఏమైందా రోజు?" బాలవర్ధన్‌కు ఉద్వేగంతో నరాలు తెగిపోతున్నట్టుగా ఉంది.

నాగరత్నం కళ్ళు మూసుకొని ఆనాటి జ్ఞాపకాలను దృశ్యాలుగా గుర్తుచేసుకుంటూ చెప్ప నారంభించింది.

(మిగతా వచ్చేవారం..)



-డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749



## బాల గేయం

### గురుశిష్యుల పొడుపుపాట!

**గురు:** పొడుపుగ వేసే ప్రశ్నలకు
పొందికగాను జవాబులే
శీఘ్రంగా ఓ శిష్యా!
చెబుతావా నా శిష్యా?
**శిష్యుడు:** చెబుతా చెబుతా గురుదేవా
అడగండిక ఆచార్య దేవా!
**గురు:** గుంజిళ్లను గుర్తించేవాడు
ఉండ్రాళ్లను భక్షించేవాడు
కరిముఖముతొ కరిణించేవాడు
కడువేగముగ లిఖించేవాడు
ఎవరో ఎవరో చెబుతావా?
**శిష్యుడు:** ఆః! చెబుతా చెబుతా గురుదేవా!
అతడు వినాయకుడే కాదా?
**గురు:** 'బాసర' 'వర్గల్'లోని నివసిస్తూ
బాసల నెన్నో ప్రసాదిస్తూ
విద్యార్థుల దీవించేది
వీణా పాణిగ నిలిచేది
ఎవరో ఎవరో చెబుతావా?
**శిష్యుడు:** ఆః: చెబుతా చెబుతా గురుదేవా!
ఆ తల్లి సరస్వతియే కాదా?
**గురు:** కాసులలెన్నొ కురిపించేది
కలిమి బలిమినే చేకూర్చేది
స్థిర చరాస్తిగా శిరసూపేది
స్థిరముగా నిలువక చరియించేది
ఎవరో ఎవరో చెబుతావా?
**శిష్యుడు:** ఆః: చెబుతా చెబుతా గురుదేవా!
ఆ మాత మహాలక్ష్మియె కాదా?

(సశేషం..)



**- డా॥ వద్దేపల్లి కృష్ణ**
9246541699

## బుడతలు

చిన్ని ,చిన్ని చేతులు
చిన్నోడి ఆటలు
బుల్లి ,బుల్లి పెదవులు
బుల్లోడి పలుకులు
బుజ్జి ,బుజ్జి పాదాలు
బుజ్జాయి నడకలు
చిట్టి ,చిట్టి చిలకలు
చిట్టబ్బాయి అలకలు
పొట్టి ,పొట్టి పలకలు
పొట్టోడి రాతలు
బుడ్డి, బుడ్డి బ్యాగులు
బుడ్డోడి పరుగులు
ఇంటి నుండి చెప్పేస్తారు
అమ్మకు బాయ్ ,బాయ్ ...
బడిలోకి వచ్చి చెప్పేస్తారు
పిల్లలకి హాయ్ ,హాయ్ ....



**-కయ్యూరు బాలసుబ్రమణ్యం**
778277240

## అక్షరాల మాంత్రికుడు

అతనేదో మాయచేసేవాడు.
చేతిలో తెల్లని సుద్ద దండంతో
సమున్నత విజ్ఞానపు మంత్రమేసి
విద్యార్థుల్లో అజ్ఞానాన్ని మాయం చేసేవాడు.
మట్టిపురుగై మగ్గిపోతున్న మనసు పక్షికి
అనంత ఆకాశాన్ని బహూకరించి
అంతరిక్షపు వింతలోకాల్ని పరిచయంచేసేవాడు.
కలల ప్రయాణానికి
కుతూహలపు రెక్కలు ప్రసాదించి
నా బాల్యాన్ని అక్షరాల స్వర్గంలో ఓలలాడించేవాడు.
అనుమానం రగిల్చిన నా ప్రశ్నల పరంపరకు
సహేతుకమైన జవాబు కవచమై ఎదురొచ్చేవాడు.
స్తబ్దత ఆవరించిన నా మస్తిష్కాన్ని
ప్రయోగాల ఆకురాయిపై పదునుదేర్చి
మెరుపు ఆలోచనల మైలు రాయిలా నిలిపేవాడు.
అప్పుడప్పుడూ అతనో శక్తిపుంజమై ఎగసిపడేవాడు.
యుక్తితో ఆంక్షల పంజరాల్ని తుత్తునియలు చేసేవాడు.
సమూహాల గందరగోళం లోంచి..
సమున్నత వ్యక్తిత్వాల సమాహారాన్ని
అతి సులభంగా సమాయత్తపరచేవాడు.
మూఢ నమ్మకాలతో మసిబారిన
మానవ సమాజం లో
ముసిరిన ఛాందస భావాల నిశి'తత్వాన్ని
సునిశితంగా తరిమికొట్టే
తిమిరసంహారకుడై తిరగబడేవాడు.
వదలిపోయిన వేర్ల జీవికను
విలువల ఎరువులతో సంప్రోక్షించి
మానవతా పుష్పాలని
ప్రజల గుండెల్లో పరిమళింపచేసేవాడు
ఒకే ఒక్కడు..
మానవ వనరుకు ప్రాణం పోస్తూ..
విశ్వాన్ని మునివేళ్లపై నిలిపి
మొద్దు నిద్రలోంచి మనుషుల్ని మేల్కొలిపేవాడు.
(గురువులందరికీ పాదాభివందనాలుతో)



**-చొక్కాపు. లక్ష్మునాయుడు**
9573250528

## నా బడి

బుడిబుడి నడకల బుడతలు ఏరీ
చిటిపోటి చేతుల చేతలు ఏవీ
చిన్నారి మోముల ముచ్చట్లేవీ
బడి మైదానంలో ఆటలు ఏవీ
పోటీగ జెప్పే కథలు ఏవీ
సందడి లేదు సవ్వడి లేదు
నిట్టనిలువునా నిశ్శబ్దమాయె
ఆటపాటల అలజడిలేక
మైదానమంతా కలుపుమొక్కలా నిలయమాయె
సదువు సంధ్యల సవ్వడిలేక
గదులన్నీ దుమ్ముధూళికి నెలవాయె
మనుజుల సంచారం అసలేలేక
విషనాగులకు ఆలవాలమాయె
అందాల నాబడి కళావిహీనమాయె
ఇకనైనా కనికరించవా కరోనా
త్వరగా వెళ్లిపోవా కరోనా
మాజీవితాలు మాకివ్వవా బిరానా



**-రాంనరేష్**
9492682285




## ప్రజాస్వామ్య సేవకుడా!

భారతీయ ప్రజాస్వామ్య సేవకుడా
తెలుగుదనపు రాజఠీవి భావుకుడా
అందుకొనుము శతజయంతినివాళి
ఓ సాహితీకారుని అక్షరాంజలి....

జాతీయ కాంగ్రెస్ కి అధ్యక్షుడివైనా
భారత దేశానికి ప్రధానివైనా
ప్రజాహితమే పరమావధిగా
ఆర్థిక సంస్కరణలే జాతినిధిగా
అపర అర్థశాస్త్రం ఆవిష్కరించి
"ఆధునిక చాణక్య" అనిపించుకున్నావు..

నిజాం నిరంకుశం ఎదిరించినావు
యువనిప్పురవ్వలా నిలిచావు
దేశభక్తిని ఎదలో నింపుకొని
స్వదేశిమంత్రం చాటిచెప్పి
'వందేమాతర ఉద్యమం'తో
"స్వాతంత్ర్యవీర"అనిపించుకున్నావు...

వేయిపడగల అనువాదవెలుగువై
కాకతీయ పత్రికసంపాదకుడివై
గొల్ల రామవ్వ కథనం నడిపి
'లోపలి మనిషి'ని మేలుకొలిపి
సాహిత్య సృజనపిపాసతో
"బహుభాషావేత్త" అనిపించుకున్నావు..

నిరాడంబర గంభీరనారసింహుడా
భారతీయ భావధార వారసుడా
అందుకొనుము శతజయంతినివాళి
ఓ జాతీయభావుకుని అక్షరాంజలి..

**-సామల కిరణ్,**
9949394688.

## కరోనా... జన జీవన చిత్రం చిద్రం

విషవలయంలో విద్యార్థులు
విద్యా ప్రపంచానికి చీకటి రోజులు
విలువలేని ధనవంతుల ఐశ్వర్యా లు
విధి వంచించిన పరిస్థితులు
విరజిమ్ముతూ విలయ తాండవం చేస్తున్న కరోనా
విజృంభిస్తున్న వెల కట్టలేని విలువైన బతుకులు
విఘాతాలకు గురౌతున్న మానవాళి
విఘ్నమే కరోనా యజ్ఞమై
విగత జీవిగా మనిషి మారుతున్న వైనం
విధానాలకు పరిమితం కానీ నినాదాలతో పరిపాలన
విస్తు పోయిన వలస మనుషుల పరిస్థితి అగమ్య గోచరం
విన్యాసాలు ఆంక్షలకు పరిమితమైన
ఇరవై వేల కోట్ల సహాయం
విశాల జగత్తు చావుల విహంగమైంది
విహంగ వీక్షణం అనుక్షణం భయం భయం
విజ్ఞులు , రసజ్ఞులు సర్వజ్ఞాన పరిజ్ఞులు
బహుభాషా కోవిదులు రాజులు రాజనీతిజ్ఞులు
ఎవరైనా కరోనా దాసులే
విషయాలన్నీ కరోనానే,
విజయాలన్నీ కరోనావే
విలువైన వేల వేల వస్తువులు
వేచి చూస్తున్నాయి షాపులో వుండలేక చేస్తున్నాయి.

విశ్వాసంతో వుండ లేని ఆత్మ విశ్వాసం గల
మనుషులయ్యారు.
విఫలమవుతున్నాయి విలువైన పరిశోధనలు
విశేషం లేని శేష జీవితంలో
సహజీవనం గడుపుతున్న కరోనా

విస్మరించకూడదు వ్యక్తిగత జాగ్రత్తలు
విడిచి పెట్టొద్దు ఆరోగ్య సూత్రాలు
విమర్శిస్తే విలువైన జీవితం కాటికి పయణమవుతుంది
వివేకంతో మేదిలి కరోనా పై విజయం సాధించు
వికలమైన కాకా వికలమైన కరోనా బతుకులు
విశ్వపు ఈ వైకల్యాన్ని చిన్న జాగ్రత్తలతో తరిమికొట్టు
విశ్వ విజేత వై వెలుగొందు.
ఓ విశ్వ మానవ నీకు జయహో......
వెక్కిరిస్తున్న మహమ్మారికి చరమ గీతం పాడు
వేల సంవ్సరాల మానవాళి చరిత్రకి
మరో మలుపు నువ్వు.....

**-దేశిని శ్రీధర్**
9849818284

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
గురువారం 10-9-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

### నమ్మలేని నిజాలు

దేశభక్తులు
దేహందేశం ఒకటే
మట్టిజీవులు.

కంఠకఠోరం
గరళడమరుకం
మైకంలో లోకం.

జలపుష్పాలు
ఆదాయఫలక్షేత్రాలు
రుచికి రుస్తుం

మందమతులు
విభాగ్యవిమతులు
బుర్రంత జిడ్డు.

కోతిగెంతులు
రాజకీయ క్రీడలు
అందని ఫలాలు.



– రేడియమ్
సెల్: 9291527757

### శ్రీనిజాలు

కరోనా మహమ్మారిని
గాలికి వదిలేశారోయ్ !
చావుబతుకు మీవేఅని
మంత్రం చదివేశారోయ్

ఆగకుండ మోగుతుంది
నెత్తిమీద సుత్తి !
ఇంటిచుట్టు తిరుగుంది
కనిపించని కత్తి !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## ముఖచిత్రాన్ని మారుద్దాం

పచ్చని తరువుల చల్లని గాలులు రమ్మంటున్నా
ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోలేని దౌర్భాగ్యం
నిండా నీరున్నా దాహం తీర్చలేని సంద్రంలా
చేతినిండా సొమ్మున్నా చేరుకోలేని తీరాలు
వలసల మీద ఊహకందని పిడుగుపాటు
దారిపొడుగునా పగుళ్ళ పాదాల రక్తపు మరకలు
ద్వేషం కూడ తెంచలేని రక్తసంబంధాలను
కనిపించని విషపురుగు విచ్ఛిన్నం చేస్తున్నది
వైరస్ సోకిన వ్యక్తిని సరిహద్దున శత్రువు కంటే
భయంకరమైన పగవానిగా దూరం పెడుతున్నది
క్వారంటైన్ గోడల మధ్య ఒంటరితనం
అభద్రతకు లోనై ఆత్మాహుతిని ఆహ్వానిస్తున్నది
ఎటు చూసినా ఏదో అర్థంకాని భీతి పొరలు
ప్రపంచ ముఖచిత్రం మీద చెరగని పచ్చబొట్టు
అగ్రరాజ్యం నుంచి అల్పజీవి దాకా అదే దడ
కరోనా కమ్ముకుందని తోటి మనిషిని దూరం పెట్టకు
అడుగుదూరం నుంచే ఆత్మీయత కురిపించు
నీకు నేనున్నాననే భరోసాను కల్పించు
ప్రాణానికి లెక్కచేయక సేవలందించే వైద్యుల కన్నా
సాటి మనిషిగా నువ్వు చూపే ప్రేమే అతనికి ఔషధం
అంటువ్యాధికి లేని అంటరానితనం మనకెందుకు
అందరినీ ఒక్క త్రాటిపై నిలుపుతూ
భౌతికంగా దూరంగా వున్నా మానసికంగా ఒక్కటై
కరోనా లేని ప్రపంచానికి బాటలు వేద్దాం.

-శింగరాజు శ్రీనివాసరావు
9052048706

## ఉనికి

చిమ్మ చీకటి నక్షత్రాల మసక వెలుతురులో
నిద్రిస్తున్న కొండలూ లోయల మధ్య
పచ్చని ఆకుల సాక్షిగా
చెట్లు కబుర్లాడుకోడం విన్నారా?
ప్రశాంతతను నెమరువేస్తున్న నది పక్కన
మినికు మినుకు మంటూ నడినెత్తిన చుక్కలకు సవాలుగా
అచ్చం పండిన నిప్పునెరుసుల్లా
మిణుగురుల రాత్రి సందడి గమనించారా?

నిత్యమూ జీవన్మరణాల వడపోతల మధ్య
అటూ ఇటూ సాగే గాలి తిరుగుళ్ళ మధ్య
ఉన్మత్తక్షణాన్ని వడిసిపట్టుకుని
మిడిసిపడటానికి ఏముందక్కడ?
గతమంతా భూస్థాపితమైన నిక్షేపం
ఎవరికి వారు తప్పుకుంటే తప్ప పైకి రాదు
వర్తమానం
భవిష్యత్తు సాధ్యాసాధ్యాల మధ్య ఒక గుంజాటన
నేను నేననే ఉనికి నిన్నటి గతమూ
రేపటి అయోమయమే.
రెండు చుక్కల తులసి తీర్థం వరకే
ఆ పైన నీలాకాశమూ ఉండదు
నువ్వూ నేననే తారతమ్యమూ ఉండదు.



-స్వాతీ శ్రీపాద
8297248988

# పీ.వీ. "రామవ్వ"కథ-భాషా రామణీయకత



-నలిమెల భాస్కర్
సెల్:9704374081

పీ.వీ.నరసింహారావు రాసిన గొల్ల రామవ్వ కథ గురించి

శత జయంతి సందర్భంగా భాషాదృష్టితో పరిశీలించడం ఈ వ్యాస ఉద్దేశం. కథ,కథనం, వస్తువు, వర్ణనాకౌశలం,పాత్ర చిత్రణ,సన్నివేశ కల్పన మరియు శిల్పం ఇత్యాదులు ఎంత ముఖ్యమైనవో కథలో భాషా అంతే ప్రధాన మైనది. అసలు మాధ్యమం జీవద్భాషలో లేకపోతే చదువరుల హృదయాలకు కథావస్తువు ఎక్కదు. పీవీ గొప్ప సాహితీ విరాణ్మూర్తి. తన కాలంనాటి పరిసరాలను నిశిత పరిశీలనతో నమోదు చేసిన తపస్వి. నిరంతర అధ్యయన శీలి. ప్రజల భాషకు పట్టం కట్టిన ప్రజాస్వామిక పండిత ప్రకాండుడు. ఈ కథలో సహజత్వానికి దగ్గరగా వున్న తెలంగాణ భాషను వాడిన ధీశాలి.

నామవాచకాలు...బెగడు(భయం),దడుపు(జడుపు రూపాంతరం),అవ్వ(తల్లి, పూజ్యురాలు), లొల్లి (అల్లరి), బువ్వ(అన్నం), బాంచెను(బానిసను),పోరి పోరడు(పిల్ల పిల్లవాడు), మూతి(నోరు), మన్ను(మట్టి), గడంచ (గడవంచె,గడమంచె), పోకడ(రాకడయుం పోకడయుం కానరానట్టి పాదరక్షలు... భల్లాణ చరిత్ర ము), గటుక (సంగటి వంటిది), పొల్ల(పిల్ల), మొగడు(మొగుడు), పెయ్యి(మెయి...ఒళ్ళూ పై తెలియకుండాలో పై వుంది),దుడ్డె(దూడ), బుడ్డోడు(పిల్లోడు) ,కైలాట్కం(కయ్యం), కావలి(కాపలా...వెలినుండు డిచ్చటికి కావలి నేనుండంగ చొచ్చు వారుంగలరే...హరివంశం),తల్లె(తలియ),ఎరుక(తెలుసు),సల్ల(మజ్జిగ),దీపప్పంతె(దీపపు ప్రమిద).

పీవీ తన కథలో ఉర్దూ పదాలు యథేచ్ఛగా వాడాడు. బజార్లు(వీధులు),పాజేబులు(కాలి ఆభరణాలు),ఉశారు(హుషారు), బాద్దురుగాడు(వీరుడు), ఖోల్(తెరువు), హరాంజాదీ (నీచురాలు), ఠాణా(స్టేషన్), ఠైర్(ఆగు),దర్వాజా(తలుపులు),బేయిజ్జతి మాట(సిగ్గు లేనిది),తోడ్ దేవోరె(పగులగొట్టరా), అచ్ఛా(మంచిది), పౌరన్(వెంటనే),డాకల(దాఖలా)...మొదలుగా గల మాటల్ని సహజ సంభాషణల్లో వాడాడు. చేతన్ చేన్ తోడన్ తోన్ తృతీయ విభక్తులైనా తెలంగాణ వ్యవహారంలో వున్న "తోటి"నే ఉపయోగించాడు."ట"అనేది "స"గా మారడం భాషలో పరిపాటి.(ఎసొంటి). ఈ కథలో మూల పదాలున్నాయి(చిమ్మనచీకటి... శబ్ద రత్నాకరంలో చిమ్మచీకటి వుంది.)

> **"కథ, కథనం, వస్తువు, వర్ణనా కౌశలం, పాత్రచిత్రణ, సన్నివేశ కల్పన మరియు శిల్పం ఇత్యాదులు ఎంత ముఖ్యమైనవో కథలో భాషా అంతే ప్రధానమైనది"**

క్రియల్లోనూ పీవీ తెలంగాణ తనం ప్రదర్శిస్తారు. సాది(సాకి),బీరిపోయి(ఆశ్చర్య పడి),కూకో(కూచో...విలోమ తాలవ్యీకరణం),పండు(పడుకో),పా(పద),తీ(తియ్యి),తినేటోడు(తినే వాడు), వెలుగజొచ్చింది(వెలుగ సాగింది), మనసుపట్టది(అర్థం కాదు),బైలెల్లుతరు(బయల్దేరతారు),ఉరికి పోను(పారిపోను),అప్పుజెప్పన(అప్పగించనా),ముచ్చట చెప్పుకుంట(ముచ్చట చెబుతూ), తోలుకపోత(తీసికెళతా), విాసాలు నరిశిన(మీసాలు నరసిన),చప్పుడు చేయకు(నిశ్శబ్దం),ఆగుర్రి(ఆగండి)...ఇలా ప్రజా వ్యవహృతిని అక్షర బద్ధం చేస్తాడు."మెల్లగా"అనే క్రియా విశేషణాన్ని "మెల్లెగ"అనేస్తాడు. చక్కగా అనే అన్నంత పదాన్ని "చక్కంగ" అంటాడు. ఈయన కథలో పేదలు ప్యాదోల్లు అయితరు."ఏడికి" యాడికి గా మారుతుంది. చప్పున జెప్పన అవుతుంది వెంటనే.

నరసింహారావు ఉపమావాచకాలను చక్కగా పట్టుకున్నారు."రాజోలిగె,దూదోలిగె, ఎర్రగొల్లోనిగె, మంజరుగున్నోలిగె"వంటి మాటల్లో "ఓలిగె"ఉపమా వాచకం. ఇది పోలె వోలెగా మారి పిదప ఓలెగా పరిణమించి చివరకు ఓలిగె గా పర్యవసించింది. ఇంకా ప్రాణం అనే పలుకు పానం అవుతుంది. రావు నిద్రమబ్బును నిర్దమబ్బు అనీ తగులుతున్నది అనీ తలుగుతాంది అనీ ఈపులు పగులుతాయి ని ఈపులు పలుగుతాయి అనీ పల్లీయుల మాటతీరును వాడుతారు. పదాది వకార లోప రూప నుడులు యథాతథంగా రాస్తారు. మీ ఇల్లు పాడుబడ,అన్యాయం పాడుబడ,దౌడలుబడ వంటి తిట్లు ఎట్లుంటే అట్ల వినియోగిస్తారు. వావ్వో,వాయెవ్వో, అవ్వల్ల,అయ్యల్ల వంటి పరితాప సూచక పదాలు వాడి పూర్తిగా పఠితల్ని కథలో లీనం చేసుకుంటారు.

తెలంగాణ నుడికారమ్మీద పీవీకి ఏదో మమ అనిపించే మమకారం కాకుండా నిజమైన నెనరుంది."ఏదో మునిగి పోయినట్లు"అనే మాట తీరును కథలో ఓ చోట వాడుతారు. ఇది "కొంపలేవో అంటుకున్నట్టు"అనే అర్థాన్ని ఇస్తుంది. "హృదయం ధడుక్కుమన్నది"అంటే గుండె గుభిల్లుమనడం."పెయ్యి మెదుగ పెట్టుడు(ఒళ్లు పచ్చడి చేయడం),బ్రతుకు కొస ముట్టుతుంది(బతుక్కిదే ఆఖరు),కుక్క చావు(దయనీయ మరణం)...ఇట్లా ఎన్నో ప్రాంతీయముద్ర కల్గిన పదబంధాల బంధాలతో కథకు పటుత్వం వచ్చింది. ఇంకా"శరీరం కొట్టుకపోయినట్లు,శరీరం రొట్టె పెంక వలె మసిలిపోవుడు,పాయ్యే పానం మర్లుతది,కడుపు లపడేసుకో,పానం దక్కిచ్చుకో,వైసు వక్కలవుడు,రాగం బెట్టి ఏడువసాగింది,తిప్పల బెట్టకండి,పేర్ల బెట్టుడు,పరీచ్ఛ పట్టి చూసుకోండి వంటి తెలంగాణ సహజ భాషా విధాన్ని వాడి పీవీ చక్కగా తన కథను తీర్చి దిద్దాడు.

తెలంగాణ తెలుగును ఆయా పాత్రల ద్వారా పీవీ పలికించిన తీరు నిరుపమానం. ఇది కాక ఆయన కథలో కథనం నడిపిస్తూ చూపించిన సమాస కల్పనా చాతుర్యం ముచ్చట గొల్పుతుంది. అసహాయ దృక్కులు,క్షణిక మృత్యుతాండవం, అస్థిరోత్పాతం, యోచనామధ్యం, అన్యోపాయాలు,అజేయ ఆశావాద దృష్టి, విశ్వసేచ్ఛ, విపద్దశ,ఏకైక తరుణాధారం, వక్షస్థలం, భావపరివర్త నంశరణార్థుడు,ఆశ్చర్య సహానుభూతులు, నమ్మిశ్రితస్వరం, సౌమ్య సౌజన్యాలు, ముఖమండలం,నవజీవన సర్వస్వసారం,పశ్చాత్తాప రేఖ,అమాయక గ్రామీణ సమాజం, తారుణ్యానురూప భావుకత్వం, పయస్సంగీతం, శూర శిఖామణి, వ్యాకులదృష్టి,అనుల్లంఘ్యం....ఈ రకంగా అడుగడుగునా కథాగమనానికి ఏమాత్రం అడ్డు రాని రీతిలో అపూర్వ సమాసాలు చేశాడు. పైగా ఇవి కథకు ఉదాత్తతనూ గాంభీర్యాన్నీ సముచిత అర్థచ్ఛాయల్నీ కలుగజేసి పరిపుష్టి నిచ్చాయి. పూర్ణబిందు యుక్త బహువచన రూపాలైన తెలంగాణ లో వాడుక లో వున్న

"పెరండ్లు,కండ్లు, ముండ్లు,ఇండ్లవెలుపల, తుపాకీ గుండ్లు,ఏండ్లకు"వంటివి కథలో చూపారు. తెలుగు కథ తాలూకు రంగు రుచి వాసనలే కాకుండా ఆత్మను కూడా ఎరిగిన పీవీ రామవ్వ కథకు భాషా రామణీయకతను అద్ది అజరామరం చేశారు.

(వ్యాసకర్త.. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత)

# ఆశయాల పల్లకిలో పాఠకుల ప్రయాణం

పుస్తక సమీక్ష







మాతృభాష ఏదైనా, స్పందించే హృదయం, మంచి మనసు సృజనాత్మకత ఉంటే మంచి సాహితీ స్రష్టలు కాగలరని సిఎస్. చంద్రశేఖర్ కథా సంకలనం 'ఆశయాల పల్లకిలో..." చదివాక తెలుసుకుంటాము.

150 కథలు, 2 నవలలు, 40 వరకు కవితలను తెలుగు సాహితీ లోకానికి అందించిన ఈ రచయిత తను చెప్పదలచుకున్న అంశాన్ని సూటిగా, సరళమైన శైలితో పఠితల మనస్సులలో తిష్ఠవేయిస్తాడు. పదిహేడేళ్ళ సాహితీ ప్రస్థానంలో, తను కన్నవి, విన్నవి ఊహా పటిమను జోడిస్తూ, ఒక్కో చోట కొసమెరుపులు సృష్టిస్తూ తన వెంట లాక్కెళ్ళ గలిగేంత బలంగా ఉంటాయి కథలు.

ప్రస్తుత సంకలనంలోని పదకొండు కథలూ, నేటి కాలపు పోకడలకు అద్దం పడతాయి. దీనికి తోడు, ఎత్తుగడ, నడక, ముగింపు ఈ మూడు కూడా, ప్రముఖ రచయిత విహారిగారు అన్నట్లు- రచయిత 'కథా కథన శిల్పశక్తి'కి నిదర్శనంగా నిలుస్తాయి.

"అర్ధరాత్రి టెలిఫోన్ మ్రోగిన శబ్దం..ఉలిక్కిపడి నిద్రలేచింది ఉష" (మాటే మంత్రము)

"సమయం రాత్రి పదకొండు గంటలు.. ఆ అమ్మాయి రోడ్డు పక్కన నిలబడి.. చేయి చాపసాగింది" (ధర్మో రక్షతి. రక్షితః)

"ఉత్తరం చివర సంతకం పెట్టబోతున్న సమీర.. ఉలిక్కిపడి.." (ఇది కథ కాదు) లాంటి వాక్యాలతో కథలను ప్రారంభించి పాఠకులలో ఉత్కంఠను రేపుతాడు. కారణాన్వేషణలో పాఠకుడు రచయిత వెంట చకచక పరుగుతీస్తాడు. ఆమె పుట్టిన రోజు కారణంగా, శుభాకాంక్షలు చెప్పటానికి ఫోను ఆ సమయాన మ్రోగిందంటూ వివరణ ఇస్తూ, ఒక చిన్న ఆప్యాయతా పూర్వకమైన మాట మనిషిపై మనసుపై ఎంతటి మంత్రాన్ని వేయగలదో, ప్రభావాన్ని చూపగలదో చెబుతాడు. విడిపోయి దూరంగా ఉంటున్న ఉష, కార్తీక్‌లను కలుపుతూ గొప్ప సందేశం ఇస్తూ ముగిస్తాడు (మాటే మంత్రం).

"శరవేగంతో మారుతోన్న ఈ కాలం మన జీవితాల్ని సుఖవంతం చేయటానికి ఎన్నో ఉపకరణాలను తీసుకువస్తోంది. అయితే- పండు కోసుకోవాల్సిన కత్తి చేతిని కోయప్రయత్నిస్తే.. తప్పు కత్తిది కాదు. ఉపయోగించటంలోని సులువులు నేర్చుకోవాలి" అంటూ చెబుతుంది "ఇది కథ కాదు". నేటి ఆడపిల్లకు లౌక్యం అవసరమని కష్టాలు ఎదు రైతే... "తలిదండ్రులు కంటే మించిన శ్రేయోభిలాషులు వేరే లేరంటుంది కథ.

ఎన్నో త్యాగాలు చేసి తలిదండ్రులు తమ పిల్లలను పెంచి పెద్దచేస్తారు. విద్యాబుద్ధులు జరిపి ప్రయోజకుల్ని చేయాలని తాపత్రయ పడుతారు. బదులుగా పిల్లలు ఇవాల్సిందే ఆదరణ, ఆశ్రయం. అయితే- ఓ ప్రబుద్ధుడు ముసలి తండ్రి తనకు బరువనుకున్నాడు. ఓ ఇంటి అరుగుపై వదిలించుకున్నాడు. ఎంతకూ తిరిగి రాకపోతే- తండ్రి మనసు 'ఎండకు కళ్ళు తిరిగి ఎక్కడ పడిపోయాడో' అని విలవిలలాడింది. కాని మోసాన్ని శంకించలేదు. ఇదీ తండ్రీ కొడుకుల వైవిధ్య మనఃస్తత్వం. కొడుకు కాపట్యం, తండ్రి మమత- బేరీజు వేసిన సంఘటనలకు పాఠకుడు చలించిపోతాడు. లోకంలో మంచితనం ఇంకా బ్రతికే ఉందని, పూర్ణిమా బాలరాజు దంపతుల ద్వారా ఆ పెద్దాయను దగ్గరకు తీసుకోవటంతో చూపిస్తాడు రచయిత. " ఓ తండ్రి కథ"లో. కథను ముగించటంలో పూర్ణిమ పాత్రను పోషించటంలో రచయిత చూపిన ప్రతిభకు అప్రతిభులవుతాము.

విశ్వ వ్యాప్తంగా తల్లి మనసు నవనీతం. కాసింత వేడికీ కరిగి తన సంతానం మీద అమృతవర్షం కురిపిస్తుంది. కొడుకు కోడలు తన యెడ చూపే 'కాపేనాన్ని' తెలిసీ భరిస్తూ సమర్థిస్తూ. కొడుకు మనసులో మార్పుతెచ్చే మంచి చిన్నకథ 'తల్లి మనసు'.

ఎక్కడా కృత్రిమత, అనవసర వర్ణన, ఊకదంపుడు సంఘటలు లేని, మంచి కథలు. పాఠకుల మనసుల్ని కదిలించే కథలు. కథకు ప్రాణం పోసి పాఠకుని హృదయానికి 'జీవిత స్పర్శ'ను అందించగలిగే కథలు. నిరాడంబరంగా కథను నడిపిస్తూ కూడా, పాఠకుని మనసు దోచుకోవచ్చునని చెప్పే కథలు.

ప్రతులకు: ఎస్.వి. కృష్ణజయంతి
హైదరాబాద్
సెల్: 9247302882



-కూర చిదంబరం
సెల్: 8639338675

## మృత్యు ఝరీ!

నా పుట్టుకతో
నువ్వూ పురుడు పోసుకుంటావు
నా నీడగా.. తోడుగా
వెన్నంటి ఉంటావు!

నీతోనే నిరంతరం నా నడక
నీ సరసనే సదా నా పడక
కనిపించకనే కళ్ళ ముందుంటావు
కలలోనూ మదిలో మెదులుతుంటావు!

మన మధ్యనున్న కట్టని గోడ
ఎప్పుడు కూలుతుందోనని తొలిచే ఆవేదన
నీతో కరచాలనం
ఎలాగుంటుందోనని నిత్యం ఆందోళన!

ఆహ్వానించినా.. అరుదెంచవు
భయపడినా.. కనికరించవు
విర్రవీగినా.. పరిగణించవు
గడువు ముగిస్తే.. క్షణం ఆగవు!

నీ స్మృతిని.. విడిచి
ధర్మం మరిచాము
నీ స్పృహ కోల్పోయి
దైవానికీ దూరమయ్యాము!

తట్టిలేపడానికేనా
ఎదుట నిలిచావు.. కరోనా రూపాన
ఆ జీవన సహచరీ!
ఆగకసాగే మృత్యుఝరీ!



- ఎస్.కాశింబి
సెల్: 9052216044

## జీవ నావ

కఠిన హృదయం పాషాణం
కరగితే నవ్య నవనీతం.
మరిగి పొంగితే దావానలం
మాధుర్యాన్ని వీడితే హాలాహలం.
గాజును మించిన పెళుసు
అందచందాలకు రాజహంస.
ఆటుపోట్లకు సాగరం
ఆనందానికి హిమశిఖరం.
బాధలకు మైనం
ప్రేమలకు పైనం.
నచ్చితే సొంతం
నచ్చకుంటే అంతం.
కోపగిస్తే ప్రళయం
ప్రేమిస్తే ప్రణయం.
కాదు ఆట వస్తువు
కాలం లయతో కదిలే ప్రాణ వస్తువు.
కల్లలెరుగని కలల అలలపై
పల్లవిస్తూ పయనించే జీవ నావ.
నిరంతర ప్రవాహం
నిర్ఝరశక్తియంత్రం.
నిధులేవీ కోరని
నిదురెరుగని ప్రాణామంత్రం.



- ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

# తెలుగు సాహిత్యంలో పేరడీలకు జరుక్‌శాస్త్రి ఆద్యుడు

తెలుగు సాహిత్యంలో పేరడీలకు జరుక్‌శాస్త్రి ఆధ్యుడు అని నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు అన్నారు. సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో గానసభ అధ్యక్షులు కళా వివిఎస్. జనార్ధనమూర్తి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత జరుక్‌శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) జయంతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా బైస దేవదాసు హాజరై జరుక్‌శాస్త్రి రచనల్లో కొన్ని 'జరుక్‌శాస్త్రి పేరడీలు' పేరుతోనూ, కథలు కొన్ని 'శరత్ పూర్ణిమ' పేరుతోనూ నవోదయ పబ్లిషర్స్ సంకలనాలుగా వెలువరించారని. తెలుగునాట జన్మించిన అంతటి ప్రతిభామూర్తి, వికటకవి అని అన్నారు. తన సమకాలీనుడైన శ్రీశ్రీ కవిత్వాన్ని భావయుక్తంగా ఆరోగ్యకరమైన హాస్యాన్ని ఈ పేరడీ ప్రక్రియలో రాసి అందరి మన్ననలు పొందారన్నారు. ముఖ్యంగా సాహిత్యరంగంలో పేరు ప్రఖ్యాతులున్న శ్రీశ్రీ కవిత్వాన్ని పేరడీ ప్రక్రియలో చెప్పడంతో అందులోని భావంతో పాటు హాస్యం అందరిని ఆకట్టుకుందన్నారు. పేరడీ అంటేనే ముందుగా గుర్తుకు వచ్చేది జరుక్‌శాస్త్రి అని, ఈ ప్రక్రియలో చాలా మంది కవులు తమ ప్రతిభను కనబరుస్తుంటారన్నారు. మనసును రంజింపచేస్తూ ఆలోచింపజేసే ఏ సాహిత్య ప్రక్రియయైనా కలకాలం నిలుస్తుందన్నారు. జరుక్‌శాస్త్రి భౌతికంగా లేకపోయినా ఆయన సృష్టించి పేరడీలు ఇప్పటి చదువరులను ఆకట్టుకుంటాయని, ఇలాంటి సాహిత్యయకారుల జయంతులు జరుపుకోవడం యువకవులకు ఉత్సాహాన్ని కలుగజేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గాయకులు టీవీ.రావు, సీనియర్ పాత్రికేయురాలు డాక్టర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.



జరుక్‌శాస్త్రి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అతిథులు.

## కరోనా కాటు

రాలిపోతున్నాయ పండుటాకులు
కాలిపోతున్నాయి నిండు బ్రతుకులు
పసివారికైనా తప్పుటలేదు ఖనన గోతులు
వయసూ వరుసా లేదు నిత్యం రగిలే చితులు
కరోనా మహమ్మారి కాటుకు బలియై
తగు జాగ్రత్తలకే స్వయంగా వెలియై

లాక్ డౌన్ ఎత్తివేత పచ్చజెండా కాదు
ప్రజా జీవనం కొనసాగ దండన లేదు
అడుగు తీసి అడుగు వేస్తే ఏమరుపాటు తగదు
అజాగ్రత్త మూలంగా మూల్యం తప్పదు

అదినిండు ప్రాణమనీ చెప్పక తప్పదు.
పెండ్లీ పేరంటాలు కరోనాకు ప్రతినిధులు
విందులు వినోదాలు మహమ్మారి వ్యాపకులు
గుమిగూడిన జనవాహిని చేటు దేశానికి
కాలుకదపనప్పుడే రక్ష ఇల్లు దేహానికి
తప్పనిసరైతె తప్ప కదులు అత్యవసరానికి



-డా॥గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

## వాన....నానీలు

ఆకాశంలో
విరిసింది ఇంద్రధనుస్సు
అందుకేనేమో
పిల్లల కేరింతలు.

వాన
వెలిసింది
కానీ కురుస్తోంది
ఆమె కళ్ళల్లో.

వర్షం కురిసింది
భూమి తడిసింది
రైతు కదిలాడు
పొలంకేసి.

వాన పడింది
చెట్లకి పులకరింత
నీళ్ళెన్ని పోసినా
ఈ అందం వస్తుందా.

పిల్లలు
చేసిన కాగితం పడవలు
పసి తనానికి
రెక్కలొచ్చాయి.

ఆకాశానికీ భూమికీ మధ్య
వాన వంతెన
పొంగి పొర్లాయి
నదీ నదాలు.



-పాతూరి అన్నపూర్ణ
9490230939

కాళన్నా..తెలంగాణకే శక్తివన్నా
నీ స్ఫూర్తిని మేము మరువమన్నా..
మా బానిస బ్రతుకుల్లో
వెలిగించిన దివ్వెవై
ఉవ్వెత్తున ఉద్యమాన్ని నడిపించావు
నిజాం దమననీతిని,
నిరంకుశత్వాన్ని
ఎదిరించే గుండెవయ్యావు
అరాచక పాలన అంతమొందగ
కలాన్ని కత్తిగమలచి
నైజాం గుండెల్లో బాకులు దింపావు
స్వాతంత్ర్య సమరయోధుడుగా
తెలంగాణ ఉద్యమకారుడిగా
ప్రజల మనిషివయ్యావు
తెలంగాణకే
నీ బ్రతుకంతా అంకితమిచ్చావు
అన్యాయాన్ని ఎదిరించే
ధిక్కారస్వరం నీది
పీడిత తాడితప్రజల
అండదండవు నీవు
తెలంగాణ భాషే శ్వాసగా
ఆరాటమే నీ గొడవ
నీ జీవన దారంతా
అక్షరాలపోరాట బాట
ఈప్రజల ప్రతిఉద్యమానికి
ప్రతిధ్వనివి నీవు
కాళోజీ.. ప్రజలగుండెల్లో
పదికాలాలు నిలిచావు
నీ జన్మదినమే..
మాకు భాషోత్సవం
అదే ఆనందోత్సవం



-డా.శ్రీభాష్యం అనూరాధ
సెల్:8790325502



తెలంగాణ సాహిత్యంతో
యువకులను కదిలించి
అక్షరాల్లో నిప్పు కణికలు కురిపించి
తెలంగాణ పోరుబాటలో నవచైతన్యం
ప్రజా సమస్యలను తన గొడవగా స్వీకరించి
ప్రతి అడుగడుగులో తెలంగాణ
ప్రతి పలుకులో తెలంగాణ
ఉద్యమ పిడుగై పోర జనాన్ని మేల్కొలిపి
సత్య సమగ్ర సాహస యోధుడు
తెలంగాణ సవ్యసాచి ...
నవ కవన కవులకు ఆభరణి
పార్థివ ప్రయోగ శిఖరియయ్యే
నిగ్గదీసి తరిమిన అక్షర బాణం
కొలిమిలో నిప్పు కణికలు...
క్రరు వాతలై కనువిప్పు కల్గించే కవనం
తెలుగు యాసలో తెలంగాణ
తెలుగు సంస్కృతిలో బతుకమ్మగా
ప్రజా గళం సాహితీ వనం కాళోజీ కవనం.

-కోలంట్ల రామకృష్ణ
9966804126

తెలంగాణ భాషను
వెలుగులోకి తెచ్చి,
తెలంగాణ విముక్తికి పోరాడిన
స్వతంత్రసమరయోధుడా,
సాయుధ పోరాట
తెలంగాణ ఉద్యమకారుడా
బహుభాషా కలం యోధుడా
తెలంగాణ ప్రజల గుండెలలో
నిలిచిన ప్రజాకవి.

నాగొడవ,
జీవన గీత రచనలతో
తెలంగాణ వాసుల
గుండెలు కదిలించిన
గొప్ప కవి
శ్రీ కాళోజీ

-యెల్ది సుదర్శన్ పద్మశాలి
9892411067

నిజాం నిరంకుశత్వాన్ని
కలంతో గళాన్ని ఎక్కుపెట్టిన
ఉద్యమకారుడు మన కాళోజీ !.
బడి పలుకుల బాష
కాదు పలుకుబడుల బాష
కావాలన్న మాతృభాషా
ప్రేమికుడు మన కాళోజీ !.
పుట్టుక నీది చావు నీది
బతుకంతా దేశానిది
అని ప్రజలకోసమే బతికిన
మానవతావాది మన కాళోజీ !.

అన్యాయాన్ని, అరాచకాన్ని
ముక్తకంఠంతో నిలదీసి
తన నా గొడవ మన గొడవగా
చాటిన ప్రజాకవి మన కాళోజీ !.

-పోటారు కుమార్
8978631913

## ఏమౌతున్నాడు మనిషి

మనిషిలో మనిషి మాయమౌతున్నాడా
మనిషిలో రాక్షసత్వం ప్రబులుతున్నదా
మానవత్వం మంచులా కరుగుతున్నదా
మనిషితత్వము కొండలా తరుగుతున్నదా?

సమాజమా ఎటు నీ పయనము
సమాధానలు లేని ప్రశ్నలే నీ గమనమా
సమస్యలకు ఆలవాలమా నీ పురోగమనము
రక్తచరితాలయాలేనా నీ సోపానము.

మద్యం మత్తుకు తల్లి తలనరికిన కొడుకు
ప్రేమ పేరిట వంచించిన ప్రియుడు
కాదన్న అక్కసుతో అమ్మాయిపై
యాసిడ్ పోసిన దుర్మాతుడు
కామంతో పేట్రేగిపోయిన
కామం శరీరము కప్పుకున్న కామరూపుడు,
ఆడదాని అంగాంగమును క్లోజప్‌లో
చూపుతున్న దార్శనీయులు.

బడిపిల్లలను పనిపిల్లలుగా చేస్తున్న వ్యాపారవేత్తలు
స్వార్ధ కుబుసములో కబోదిగా మారుతున్న
బడాబడా నాయకులు
ధన వ్యామోహములో దేశరహస్యాలను
అమ్ముతున్న దేశద్రోహులు
అన్నింటికి తలవొంచి మనిషి బ్రతుకుతున్న
ఆకలో,ఆటవికమో –విశాఖలో మనిషి
పురైను తిన్న వైనం –రేపింది కలకలం
మనిషి మెదడులో రేగింది ఆలోచనాలోచనా
సంద్రపు కెరటాలు.

ఓ మనిషి
ఇప్పటికైనా యోచించు–
నువ్వొండే సమాజాన్ని మార్చాలనే కంకణముతో పోరాడు
కోవిడ్ తో యుద్ధము కొంతకాలమే
కోవిడ్ కన్నా ప్రమాదమైన వారితో ఎంతకాలమో,
అధైర్యపడకు, సంపూర్ణ విశ్వాసముతో ముందుగు సాగు
నీలాకాశములో క్రమ్ముకున్న మబ్బులను
చెదరికొట్టిన జ్ఞాన సూరీడులా,
శౌర్య సూరీడులా ప్రతి ఒక్కరూ ప్రకాశిస్తు
సమాజానికి పట్టిన కుళ్లును కడిగిననాడు
అవుతాడు మనిషి మహాత్ముడు
దీపాల్ని వెల్గించే మహా మనిషి.



– విశ్వనాథ నరసింహం
9490971589

## ఓ భరత ఖండమా. ..

పల్లవి : ఓ భరత ఖండమా . మా జంబు ద్వీపమా
నీ పుత్రుల స్థితి గాంచి తల్ల డిల్లు హృదయమా
మా రక్షణ కవచమా మా నీడ వృక్షమా
మా శ్వాస లో దాగిన ఓ వాయు తేజమా
॥ఓ భరత॥

ఓ యమ్మ నీ కంంట చీకటి నిండెను చూడు
నీ పుత్ర రత్నాల పగిలిన గుండెను గాంచు. :2:
ఓ దార్వు గీతమా మా పాలిట ధైర్యమా
నమ్ముకున్న హృదయాలను కరుణించే దైవమా
॥ ఓ భరత ॥

ఈ పుణ్యభూమి లోన పెరిగిన కష్టాలు చూడు
మంటల్లోబూడిదయ్యేనాగరికత వెతలు చూడు: 2
మా స్వేచ్ఛకు ప్రాణమా త్యాగాల రూపమా
ఘన చరిత్ర గల్గినట్టి ఆదర్శ దేశమా
॥ఓ భరత ॥

ఓ మాత నీ కంట కన్నీరొలికెను నేడు
ప్రతి చోట ఈ పూట అలజడి రేగెను నేడు
ఎటు చూసిన అనైతికం ఎటుచూసిన విధ్వంసం
చైతన్య కేతమా వీరపుత్ర నిలయమా
జీవకోటి సుఖ జీవన పరహిత విజ్ఞానమా
॥ఓ భరత॥

బాధ్యత మరిచినట్టి భావి భవితలను చూడు
మనిషి లొ పెరిగినట్టి రాక్షస కృత్యాలు చూడు
ప్రేమ నంత పంచగా ప్రతి మదిలో నిలువు మా
నిస్వార్ధ త్యాగశీల దయామయా హృదయమా
॥ భరత॥

ప్రకృతి విలయం రేపిన విధ్వంసం ఒకవైపు
స్వార్థాల గెలుపు కై మనిషి పతన మొకవైపు
విలువలనూ పెంచగా ధైర్యమయ్యి నిలువు మా
శుఖ శాంతులు నింపేటి దారి మాకు చూపుమా
॥ఓ భరత॥



–సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

## మేథో శిల్పి...!

జన్మనిచ్చిన ఆదిగురువు అమ్మే..
జగత్తు తొలి పరిచయకర్త నాయనే..
అక్షర జ్ఞానంతో అజ్ఞానాన్ని తుంచి..
మేథో ఉలితో శిలను శిల్పంగా మలచి..
స్వయంప్రకాశిత రవిగా మార్చావు గురువా !

పుస్తకం నేనైతే అక్షరం మీరైనారు...
కలం నేనైన ఇంకు మీరే పోశారు
దేహం నాదైన ప్రాణం మీరే పోశారు
భాష నేనైననూ భావం మీరే నింపారు
అక్షరం నేనైన అర్థం మీరే కూర్చారు గురువా !

నిండు కుండలా ఎదుగుతూ ఒదగమని..
జ్ఞానామృతాన్ని ఓర్పుతో రుచి చూపి..
చెలియలో ఊటలా విద్యాదాహాన్ని పెంచి..
నడక, నడతలు నేర్పి ఆత్మవిశ్వాసం నింపి..
వెలుగుతూ చీకట్లు చిదిమేయమన్నావు !

ఎంతెత్తు ఎదిగినా, ఎన్ని మెట్లెక్కినా..
శిష్య పరమాణువునేగా నీ ముందు..
గురువుగా నాలోన నిన్ను చూసుకొన్నావు
త్రిమూర్తుల అంశగల నీ జన్మ ధన్యమ్ము
అందుకో జే జేలు జ్ఞాన వితరణ శీలి !

నే నెలా ఉన్నానో అద్దమే చూపింది..
ఎలా ఉండాలో నేర్పింది మీరేగా గురువా...
గుళ్లల్లో, పటాల్లో దేవుళ్ళను దర్శిస్తే..
జ్ఞాన జ్యోతితో నా చీకట్లు చిదిమిన..
మీలోనే చూశాను గురు దైవమా !



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## అద్దం

అద్దం నా యెదుట లేనప్పుడు
నీకళ్లు,
నా ప్రతిబింబానికి నకళ్లు.
నీవు నా యెదుట లేనప్పుడు
నా మనో పలకంపై
నిన్ను స్మరించుకుంటాను,
నన్ను నేను దర్శించుకుంటాను.
ఇల్లు వాకిలి అద్దం లో
ప్రతి బింబిస్తుంది.
మింటి అందం నక్షత్రాల
దర్పణంలో మెరుస్తుంది.
అద్దం తుంటరిది !
తన ముందు కొస్తే
వద్దన్నా అన్నీ చూపుతుంది.
అందాలన్నీ తనలో
ఆరబోసుకో మంటుంది.
దానికి సిగ్గు ఎక్కువ!
ఏ మూలలో ఏ అర్థముందో
జాగ్రత్త సుమా!
అద్దం పగిలి తనువు ముక్కలైనా
అన్నిటీలో అదే చిత్రం!
ఈ జగత్తులో ఇదో విచిత్రం
అబద్ధమాడని అద్దం!
అంతా నిజం చెబుతామని
ఒట్టేసి ఏం చెబుతారో,
అద్దంను అడుగు.
సూర్య–చంద్రులు వెలుగు
అద్దాలు.
దర్పణాలు నీడల జాడలు.
నిజం నీడలా వుంటుంది.
అద్దం ముందు కొస్తే గాని
తెలియదు!
అంతరంగ దర్పణం లో
నీ దర్పాన్ని సంస్కరించుకో!
అద్దం ఆదర్శానికి
నమస్కరించుకో!??



–పి.బక్కారెడ్డి
9705315250

## ఒక్కసారి అడిగిచూడు

నీక్కొంచం ధైర్యం ఉంటే
అడిగి చూడు
నీ అంతరాత్మ
అన్నీ నిజాలే చెబుతుంది.

నీ వికృతి చేష్టల
విశ్వరూపాన్ని
విశదీకరిస్తుంది
నీ మాటల్లోని మర్మాన్ని
బట్టబయలు చేస్తుంది
నీ పాపపు చూపుల్లోని పైత్యాన్ని
పసిగట్టి చూపుతుంది
నీ నికృష్టపు యవ్వారాల్ని
నిగ్గుతేల్చుతుంది
చిత్తశుద్ధి లేని
నీ చెత్త సంస్కారాన్ని
తూర్పారబడుతుంది
నీ తెరచాటు తెగింపుల్ని
తేటతెల్లం చేస్తుంది

నీ చేష్టలు, మాటలు, చూపులు
శుద్ధవుతాయేమో
ఒక్కసారి అడిగిచూడు
నేనంటున్నాని కంగారేంలేదు
నిన్ను నువ్వు నిదానించుకుని
గుండెను నిబ్బరపర్చుకుని
ఒక్కసారి అడిగిచూడు
నీ అంతరాత్మ
అన్నీ నిజాలే చెబుతుంది



–యం యస్ రాజు
9502032666

## దా.నా పదాలు

హిమనగోన్నతి తెనుగు
సుమసమోన్నతి తెనుగు
క్రమభారతి తెనుగు
ఓ చిన్ని దా.నా!

జ్ఞానపీఠము తెనుగు
ధ్యానపీఠము తెనుగు
కామ్యసిద్ధియె తెనుగు
ఓ చిన్నిదా.నా!

శుకభాషణము తెనుగు
పికగానమది తెనుగు
తకధిమిత యును తెనుగు
ఓ చిన్ని దా.నా!

పోతన్న పోతలో
శ్రీనాధు పూతలో
వేమన్న వెలదిలో
తెనుగేను దా.నా!
ముఖచిత్రమున తెనుగు



–కిలపర్తి దాలినాయుడు
7780589336

## గొడుగు

వేల యేండ్ల క్రితమె వినియోగమున నున్న
గొడుగు గొప్పతనము నుడువ తరమె?
గొడుగు గొప్పతనపు గుర్తాయె మొదట,ఆ
పైన జనుల వాడ్క వస్తు వాయె!

ఎన్నరానియన్ని వన్నె చిన్నెలతోడ
దిన దినాభివృద్ధి గనియె గొడుగు;
రాజ లాంఛనముగ రాజిల్లె,నుపయోగ
పడుచు జనుల మెప్పు వడయుచుండె!

తాటియాకు గొడుగు తాతముత్తాతల
కాలమందు వాడకమున గలదు;
నేడు మృగ్యమయ్యె,వాడకమే లేదు;
కంటజూతుమన్న కానరాదు!

ఏంత మేలుచేసె!ఎండ వానల నుండి
ప్రజకు కలుగ జేసె రక్షణమ్ము;
కన్నతల్లివోలె కాపాడె ప్రజలను,
కంటిరెప్ప వోలె కాచుకొనెను!

అట్టిదైన తాటియాకు గొడుగు నేడు
కానబడదు మచ్చుకైన నొకటి;
గుడ్డ గొడుగు వచ్చె,కొత్త సౌకర్యాల
దెచ్చె,జనుల కవ్వి నచ్చె మిగుల!

మీట నొక్కి దాని వాటముగా విప్ప
వచ్చు,నటులె ముడువవచ్చు గూడ;
బరువు తక్కు వగుట,బాధలేకుండ,చే
బట్టి తిరుగుచుండవచ్చు సతము!

ముడుచు టొకటె కాదు,పొడవును తగ్గించ
గలుగు 'సులువు'గూడ కలిగియుంట
చేయవచ్చు దాని జేబుకు సరిపడ–
జేనె డైన, బెత్తె డైన గాని!

అవసరమ్ము గలిగినపుడు తెరచుచు,
అవసరమ్ము లేనియపుడు ముడిచి,
గుడ్డగొడుగు వాడుకొనవచ్చు గావున
ప్రచురమయ్యె దాని వాడకమ్ము!

అందువలన తాటియాకు గొడుగులకు
స్వస్తి పలికినారు ప్రజలు; వాని
ముందు తరములందు
'మ్యూజియముల'లోనె
కాంచి తృప్తిజెందగలరు గాక!

కాల గమనమందు కలిగెను మార్పు రూ
పమున,గాని గొడుగు వాడకమ్ము
మానలేదు జనులు,మాన;రెండలు
వానలుండునంతవరకు నుండు గొడుగు!

గొడుగు గతమునందు కొన్ని సందర్భాల
దానమిచ్చుసంప్రదాయ ముండె;
పనికివచ్చు వస్తువును దాన మిచ్చుట,
పుచ్చుకొనుట గూడ మెచ్చ దగును!

పనికిమాలినట్టి వస్తుదానము నేడు
తరచు 'గొప్ప' కొరకు జరుగుచుండు;
దానమునకు ఫలము
దక్కునా,ఉపయోగ
పడని వస్తువులను పంచు వెడల?



–హెచ్.ఆర్.చంద్రం
9493248053

## మనుషులుగా

మనుషులుగా ఇప్పుడైనా ద్రవీకరించాల్సిందే
ఏళ్ళుగా పొరలు.. పొరలుగా
చుట్టుకుపోయిన స్వార్థంతో బండబారిన
రాతి గుండెలనిప్పుడు
గుప్పిట పట్టి చూడాల్సిందే..!
ఎన్ని మాయ పొరలు కప్పుకుని
చీకటి గెట్ల అంచులు పట్టుకుని.. అదేపనిగా గబ్బిలంలా
తలకిందులై వేలాడుతున్నాడు–?
చుట్టూరా అల్లుకున్న అయోమయంలోంచి
ఏదో మెరుపుల నిచ్చెనమెట్ల వెంట..?!
దేనికీ స్పందించనీయని పోతపోసుకున్న
రాతి గుహల్లో తిరుగాడుతుఆన్నడు–
చీకటైనా..వేకువైనా.. తన కోసమేనని
భ్రమల్లో బతుకుతున్నాడు–
ఆగిపోని కాలచక్రం అప్పుడప్పుడు
భూమిలోతుల్లో కుదుపులిచ్చినట్టు
మనిషికి భయాల సంఘటనలు..

పెంచుకుంటూ వచ్చిన అనుబంధాల
పందిళ్ళని కూల్చేయటానికే
కొత్తదనాల అలుకుడు చేస్తున్నారు!
కొత్త పంటల.. కొత్త వంటల.. కొత్తరుచుల్లో
కొత్త సోకులతో హొయలు పోతున్న నాగరికత
ఎక్కిన కొమ్మనే నరుక్కోవటానికి
ఎంతకైనా సిద్ధపడుతోంది?
దారి తప్పిన నడతలిప్పుడు
సర్వ సాధారణ సూత్రమవుతోంది..?!
దేనికోఓ తాకట్టు పెట్టిన బుద్ధి విడిపించుకుని
కాసింత పదును పెట్టుకోవాలి
కరుణలేని కన్నీళ్లులేని
గుండెలెక్కడైనా ఉంటే..కొంచెం కడిగేసుకుని
అసలైన మనుషులుగా బతకడానికి యత్నించాలి..!!



–మోతుకూరి అశోక్ కుమార్
9247380976

## జీవన యాత్ర

నిమిషాలు, ఘంటలు, దినాలు,
పరుగులు తీస్తూనే ఉంటాయి
కాలం ఎవరికోసం ఆగదు
అన్నీ అనుకూలం గా ఉంటే జీవితంలో
ఘంటలు నిమిషాలుగా క్షణాలుగా గడుస్తాయి
సమస్యలు ఎదురైతేనే అదేమిటో
క్షణాలు యుగాలుగా మారతాయి.
సాఫీగా సాగుతున్న కాలప్రవాహం
ఒక్కసారిగా సవాలుగా మారుతుంది
మనస్సు ఆగమాగమై పోతుంది
ఒక్కసారిగా కాలం స్థంభించి పోయినట్లుగా
మనసు మూగబోతుంది
మనస్సును జయించాలంటే
మనిషికి కావాలి ఆత్మ జ్ఞానం
తానేమిటో తాను తెలుసుకోవాలి
ఆత్మజ్ఞానం ఒక ఊర్ధ్వ గమనం
చైతన్యాన్ని చిక్కబట్టుకుని
మనోబలంతో ముందుకు సాగాలి
అప్పుడే జీవనయాత్ర సఫలం అవుతుంది.



– డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

## చిట్టి చామంతులు

సవతితల్లి
ఉంటేనే కదా!
బిడ్డలకు
కన్నతల్లి ప్రేమ తెలిసేది!!

సెలవులు
ఉంటేనే కదా!
తల్లితండ్రులకు
పిల్లల అల్లరి తెలిసేది!!

ఎన్నికలు
ఉంటేనే కదా!
నాయకులకు
ఓటరు విలువ తెలిసేది!!

ఉలిదెబ్బలు
తింటేనే కదా!
బండకు
పూజలు దొరికేది!!

రాపిడి
చేస్తేనే కదా!
వజ్రం
తళతళ మెరిసేది!!



–జాధవ్ పుండలిక్ రావు పాటిల్,
9441333315

## కాలానుగుణంగా సాగిన నవలికలు




ఆశయం అనేది తేలికైన పదం కాదు. మానవాళి మోయలేనంత భారం. ఒకప్పుడు ఒక అనాధను పోషించడం, అనాధ శరణాలయాలను నడిపించడం, వృద్ధాశ్రమాలను నడిపించడం, ఒకరికి మంచి చేయడం, ఒకరికి సాయం చేయడం లాంటివే కాకుండా మాటమీద నిలబడటం, జీవితం తాను అనుకున్నట్లే తీర్చిదిద్దుకోవడం లాంటివి కూడా ఆశయాలే. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కూడా వీటిని సాధించడం ఎంత కష్టతరం. అందుకే వీటి భారాన్ని భరించడం కోసం ప్రభుత్వ సహాయాలు తప్పనిసరి అవుతున్నాయి. కానీ ఎవరికి సంబంధించిన వ్యక్తులను వారు తమ ఇంట్లోనే ఉంచుకుంటే ఈ బాధ్యత మరొకరి ఆశయం కాదు. మరో ఆశయం ద్వారా మరొక మంచి పని ఏదయినా ముందుకు నడిచేది. తాను కంటున్న బిడ్డ పొరపాటు కావచ్చు, తల్లి చనిపోవచ్చు. ఆడపిల్లని కావచ్చు ఇలా ఎక్కడపడితే అక్కడ పడేయకపోతే ఇలా మరొకరి బిడ్డను పెంచడం ఆశయం కాస్త మారచ్చు. నిజంగా అవసరమైన వ్యక్తులకే చెందవచ్చు. అలాగే మాట మీద నిలబడాలనే తత్త్వం, తన జీవితం తాను అనుకున్నట్లే తీర్చిదిద్దుకోవడంలో ఎంతో కష్టనష్టాలు ఎదురవుతాయి. అయినా వాటన్నింటినీ అధిగమించి సాధించడం మనిషిని మరింత ఉన్నతికి చేర్చుతుంది. కాలం అనేది ఎంతో గొప్ప మందు. ఆ మందుతో ఎన్నో సమసిపోతాయి. యుద్ధాలు సైతం కొంత కాలం అయ్యేసరికి చిన్నవిగా కనిపిస్తాయి. జన్మ కక్షలు సైతం సరదాగా మారిపోతాయి. అలాంటి కాలం ఇచ్చిన తీర్పు అంటే పూర్తిగా పరిశీలించాల్సిందే.

తురగా జయశ్యామల రచించిన రెండు నవలికలు ఎంతో ఆదర్శవంతంగా నడిచాయి. ఏ ఒక్క పాత్రనూ కించపరచకుండా నడిపిన తీరు ఎంతో చక్కగా ఉంది. ఇంటిముందు ఎవరో వదిలేసి వెళ్ళిన బిడ్డను విశ్వం (బ్రహ్మచారి) అందుకోవడం పెంచి పెద్ద చేయడం ద్వారా ఎంతో మహనీయతను చాటారు. ఒంటరిగా ఉన్న తన జీవితంలో వచ్చిన ఆ బాబు ఒక వెలుగులా, తనకు దేవుడిచ్చిన తోడులా భావించడం ద్వారా గొప్ప సందేశం సమాజానికి అందించారు. అటువంటి వ్యక్తిని గురువుగా భావించిన శిష్యుడు వాసు. గురువుకు తగినట్లే తనకంటూ ఒక ఆశయాన్ని ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ద్వారా నిరూపించాడు. తాను ప్రేమించిన యువతిని ఇతర అడ్డంకులు ఎదురైనా వాటిని త్రోసిపుచ్చి ఆ యువతినే వివాహమాడాడు. ఆ రకంగా గురువుకు తగిన శిష్యుడుగా నిలిచిపోయాడు. ఆదర్శాలు వల్లించడం వరకే జీవితం అనుకునేవారే ఈ లోకంలో అనేకమంది ఉన్నారు. కానీ ఆదర్శాలనేవి ఆచరించడానికి అని తెలియజేసిన నవల "కాలమిచ్చిన తీర్పు"

ఇక రెండవ నవల "పెళ్ళిపందిరి" .. ప్రేమ, నమ్మకం, అనే పదాలు ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయాయి. ఇంకా ప్రేమ మిగిలి వుంది అంటే కేవలం అమ్మనాన్న దగ్గరే.. అక్కడే ఆగిపోయింది. దాటి బయటకు రావడానికి కూడా ప్రేమ ఇష్టపడటం లేదు. దాటితే తనలోని స్వచ్ఛత అడుగంటిపోతుందనే భయం ఉంది మరి. ఇక పెళ్ళి. ఒక వ్యాపార ఘట్టం. ఇరువురిలో ఎంత సంపాదన, ఎంత మిగులు, ఫ్యూచర్‌లో ఖర్చులు పోయాక మిగిలేదెంత? అందులో నీ ఆనందం ఎంత? నా ఆనందం ఎంత? ఇక్కడ ఒకటి మనం గమనించాల్సి ఉంది. ఈ కాలంలో పెళ్ళి అయినా సరే వారిరువురి మాటల్లోనూ మనం అనే మాట వినిపించదు. నీది నాది. మీ వాళ్ళు, మావాళ్ళు అనే ధోరణి కొనసాగుతూ ఉంది. సరే.. ఇవన్నీ అటుంచితే ఈ నవలిక ఒక ప్రేమ కథ. మామూలుగా శరీరాకర్షణ కు ప్రేమ అనే పేరు తగిలించుకుని భరత్, పూజను ప్రేమిస్తాడు. తను చూపే ప్రేమ, మాటలు నిజమని నమ్మి, పూజ కూడా ప్రేమిస్తుంది. ప్రేమ తర్వాత మనకు వినిపించే మాట నమ్మకం. ఆ నమ్మకంతో తొందరపడుతుంది. ఆ తొందరపాటుకే చక్కని పేరు అమాయకత్వం. ఒక పురుషుడికి లొంగిపోయేంతదాకా వచ్చాక ఇక అమాయకత్వం అనే పదం ఎక్కడుందో నాకు అర్థం కాని విషయం. అయితే అమాయకత్వంగా లొంగినా. గడుసుగా లొంగినా ఫలితం స్త్రీయే అనుభవించాలి కదా.. ఆ తర్వాత పూజ సామాజికంగా, మానసికంగా ఎలా కృంగిపోయిందో.. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో అర్థం కాని తనంతో సాగిన నవలిక ఇది. ఆ తర్వాత వినోద్ అనే ఒక పాత్ర ప్రవేశించి తన గాధను అర్థం చేసుకోవడంతో కథ సుఖాంతం అవుతుంది.

ప్రేమించగానే ఎక్కడికి పిలిస్తే అక్కడకు వెళ్ళిపోకుండా ఉంటే పూజ జీవితం ఇంతదాకా రాకపోయేదేమో కదా అనుకునే దాకా కూడా కథ వెళ్ళకపోవడం కొంచెం ఆలోచనలో పడేస్తుంది,..

రచయిత్రి తురగా జరశ్యామల నవలికలు రెండూ సామాజిక స్పృహతో సాగినవి. ఏదయినా అర్థం చేసుకుంటే అందమైన జీవితం ఉంటుంది. అర్థం చేసుకోకుంటే జీవితం నిరర్థకం అనే విషయాన్ని చాటిచెప్పిన ఈ నవలికలు ఎంతో ఉపయుక్తమైనవి. రచయిత్రికి అభినందనలు..

ప్రతులకు: తురగా జయశ్యామల
ఫోన్: 098208 40285



–శైలజామిత్ర
9290900879

## దైన్యం

తల్లితండ్రుల్లేక పోతే
అనాథ అంటారనీ తెలీదు

నా వయసు తెలీదు
నాలో మార్పులెందుకొస్తాయో తెలీదు
నా భారాన్ని మోసే శక్తి లేని
నా వాళ్ళు ఆశ్రమంలో పడేసారు
అదే వారికి చేతనైంది
అంతకన్నా చేయలేని స్థితిలో ...

ఆశ్రమం లో మంచే జరుగుతుందనుకున్నా
ఆలనా పాలనా జూచే వాళ్ళే దైవమనుకున్నా
దానగుణంతో శారీరక సుఖాల ఎరతో
ఎదుగుతున్న చోటని తెలీదు.

వాడు యాభై నాలుగు
నేను పద్నాలుగు
సిగ్గులేని కామాంధుడు
మత్తుమందు ప్రయోగాల పరంపరలో
మానం చిత్రవధ
అచేతనావస్థలో తోటివాళ్ళే
బట్టలు తొడిగిన దైన్యం .

ఏమిటని ప్రశ్నించలేని
ఏమి జరిగిందో జరుగుతుందో తెలీని దీనావస్థ
ఆశ్రమాల అంగట్లో అంగాంగాల రాపిళ్లల్లో
శుష్కించిన దేహం.

గర్భం దాల్చాను నాకు తెలీకుండానే
ఒళ్ళంతా వ్యాపించిన విషం
కరడు గట్టిన పురుషాధికృత దాడితో
నేనో అభాగ్యురాలిని
వెళ్ళిపోతున్నా
ఈ రోజు మీడియాలో వార్తగా
రేపు జనం నోళ్ళల్లో
ఎల్లుండి నేనో మరచిన గతాన్ని.

నా పక్షాన వాదనలుండవ్
శవ పంచనామా
పంచాయితీ
దోషులు దర్జాగా బయటికి
మళ్ళీ నాలాగే మరో అనాథ
అంతే ! అంతకన్నా ఏమీ జరగదు !
పుణ్యభూమిలో ఓ బాలిక బలి !!
నేనో ముక్కుపచ్చలారని బాలిక ని
చెరచబడ్డ బిడ్డని!



– గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201

## రాయాలంటే ...

రాయాలంటే
మనం రాయవల్సిందేదో
మొదట మనకు తెలియాలి
దేనికోసం రాస్తున్నామో
ఏ ప్రయోజనం కోసం రాస్తున్నామో
మనం నిర్ధారించుకోవాలి !

మనకు తెలిసిందల్లా రాసేస్తామంటే
మనకంటే తెలివైనవాళ్లు
కొట్టిపారేస్తారు ! ఉతికి ఆరేస్తారు !

మనకు తెలియనిది
తెలిసినట్టుగా రాసేస్తామంటే
మనకంటే తెలివితక్కువవాళ్ళు కూడా
మనల్ని ఎగతాళి చేస్తారు
గేలిచేసి అవమానిస్తారు !

రాయాలంటే
మొదట మనం అధ్యయనం చేయాలి
తీవ్రంగా మదింపు చేయాలి

ముడిసరుకు బుర్రలో కుక్కి
రూపసరుకు బయటకు రప్పించాలి

అప్పుడే మనం రాసిందానికి విలువ
మనం చెప్పిందానిపై మక్కువ !



–పి. లక్ష్మణ్ రావ్
9441215989

## నానీలు

అరికాలి మంట
నెత్తి కెక్కింది
కళ్ళు ఎర్రబడ కుంట
ఎలా ఉంటాయి

బతుకు పతంగి
బాగానే ఎగురుతుంది
కష్టాల ముళ్ళు
తగులుకోనంత వరకు

కలియుగ భారతంలో
కీచక పర్వానికి
పేజీలు
ఎక్కువే

ఊసరవెల్లి
నేటి నేతలను
చూసింది
ఉరేసుకుంది

మన్ను తిన్న పాము
కదలదు
మనీ తిన్న నేత
రాజకీయాలను వదలడు

వినే దద్ద మ్మ లుంటె
నేతలు
చెపుతూనే ఉంటారు
కాక మ్మ కధలు

అడుగడుగునా
వినాయకుని విగ్రహం
అవినీతికి సాక్షి గా
దోపిడీకి గుర్తు గా

కరువు వేదం
చదివితే
ఎవరికైనా
నిర్వేదమే.

నోరు నొక్కేసారు
చేతులు కట్టేసారు
కాళ్ళు కదులుతున్నాయి
హక్కుల కోసం

నాయకులు
ముందు కెల్లుతున్నారు
దేశం
వెనక బడింది

పుట్టి పుట్టగానే
కేర్.... కేర్
పసి కందుకి
జాగ్రత ఎక్కువే

సన్యాసం
స్వీకరించాడు
కారులోనే ప్రయాణం
ఏ. సీ గది లో నివాసం

మన్నునే
నమ్ముకున్నాడు
రైత న్న నోట్లో
ఎప్పుడూ మన్నే

శాసన సభ లోనే
అధికారపక్షం,ప్రతి పక్షం
బయటకొస్తే
అంతా అవినీతి పక్షం

దేశంలో హక్కులు
లెక్కలేనన్ని
అమలులో
చిక్కులే అన్నీ

నాయకులకి
కావాలి కోట్లు
వాళ్ళ కెందుకు
ప్రజల పాట్లు

స్వేచ్ఛగా పోలింగ్
యదేచ్ఛగా రిగ్గింగ్
ఎంతైనా
ప్రజాస్వామ్యం కదా

పట్టు పరిశ్రమలో
అంద వేసిన చేయి
అతనిదే
రాజకీయాలలో పైచేయి

జైలులో కూడ
సకల సదుపాయాలే
అక్కడ ఉన్నది
నాయకుడు

ఎన్నే ళ్లైన
ఎన్నాలైనా
వినాయకుల మాటలు
నీటి మూటలే

భారతీయులంతా
ఒక్కటే
జనాభా లెక్కలతో
కులాలు మతాలు ఎందుకు

నీతి గల నేతలు
కరువు
సామాన్యుల బతుకులు
బరువు

పేదవాడికి
కడుపులో మంట
ఉన్నవాడికి
కడుపు మంట

అవినీతి పీడ
సోకింది
ప్రగతి మొక్క
పెరుగుదల ఆగింది

నిస్వార్ధ సేవకు
నిందలే
పండ్లిచ్చిన చెట్టుకి
రాళ్ళు.



–ఆచార్య గిడ్డి వెంకట రమణ
9440984416

## హైకులు

వేకువ పూలపై
పద్యాలై రాలుతున్నవి
నిద్రలేని రాత్రులు.

సముద్ర తీరాన
చంద్రున్ని మోస్తూ
ఒంటరి కొబ్బరి చెట్టు.

చేను పండింది
లోకమంతా చల్లగ
వర్షానికి కృతజ్ఞతలు.

నా కలం
స్వల్పమైనదే
సమాజాన్ని చెక్కే ఉలి.

పిట్ట నెత్తిన
ఎంతపెద్ద వృక్షమో!
పురివిప్పిన నెమలి.

పైరగాలికి
ఆకుల గుసగుస
మేఘాలకు చమట పట్టిందని.

ఒకే తీగ
స్త్రీ పురుష పుష్పాలతో
అసమాన పరిమలాలు.

తీరని కోరికలు
తీరిపోతున్నాయి
పగటినిద్రలో నేను.

ఈ శిలలు
నలుపని దూరంపెట్టకు
ప్రపంచాన్నే నడిపిస్తున్నవి

లారీల ప్రవాహంలో
కొట్టుకుపోతూ ఇసుక
రోదిస్తూ నదులు.

వ్యవసాయ విక్రమార్కుడు
కాని
చెట్టుకు వేలాడేది తనే

ఈ పొలం
అమ్మబడును
మట్టిరుణం తీరింది.

ప్రకృతి నిండా
తైలవర్ణ చిత్రాలు
కాలాలే పికాసోలు.

హేమంత నిశీథి:
నిద్రను పంచుకుంటు
నిప్పుల కుంపటి.

ఫలభారంతో,
వంగింది చెట్టు
అనుభవాల్నీ మోస్తూ...!



–దామరకుంట శంకరయ్య
9440876788

# జులై నెలలో ఉత్తమ బహుమతి పొందిన 'పాట వెలుదులు'

ప్రథమ

## రైతు

కోడి కుయగానె పాడి కొరకు
లేచి వెళ్ళునతడు పేచి పడక
దేశ ప్రగతి జగతి దిశలు చాటు
రైతు కంద జేతు జోత లెపుడు!!

ఆరు గాలమంత నాత్రముగను
కష్ట పడును రైతు నిష్టముగను
మెతుకు వృద్ధి చేసి బ్రతుకునిచ్చు
కర్షకునికి పంచు హర్ష మింత!!

కరువు కాలమందు కర్ష కుండు
హలము చేత బూని పొలము దున్ను
నమ్మ కమ్ముతోడ నెమ్మనమున
సాగిపోవుచుండు స్వాంతనముగ!!

కల్మషమ్ము లేని ఘనుడురైతు
మత్సరంబు లేని మాన్యు డతడు
నార్తి దీర్చి మనకు నాప్తుడాయె
ననుచు తెలుపు చుంటి నందరికిని!!

దుక్కి దున్ని రైతు బక్క చిక్కి
పక్కటెముకలన్ని సొక్కి యున్న
అన్న మిచ్చు నతడు యన్న దాత
గౌరవించు మెపుడు ఘనముగా ను!!

కాటకములు నున్న కరువు లున్న
కర్రు చేత బట్టి కౌతుకమున
కదులుచుండు నతడు కర్మ జీవి
కర్మ ఫలము లెపుడు గాంచునతడు?

గొప్పలెప్పు డేనిచెప్పు కోడు
తిప్పలెన్ని యున్న తప్పు కోడు
నిప్పు వంటి వాడు నిజము రైతు
తెలుసు కొనుము వోయి తేటముగను!!

మండు టెండయున్న మదన పడడు
వానలోన తడిసి వణుకబోడు
చలికి తట్టుకొనుచు చెలిమి చేయు
కల్మషమ్ము లేని కర్షకుండు!!

పంట పండు కొరకు పస్తు లుండు
యెడ్ల బండ్ల పైన వడ్లు నింపి
ప్రజల కొరకు పంపు పరమ పుణ్యు
డతనికంజలింతు నాదరముగ!!



-గుండ్లరాజు,
9885257050

ద్వితీయ

## కన్న వారికి దిక్కు ఎవరు?

తండ్రి నాటి ధనము లేదు.దున్న నొక్క గుంట దుక్కి లేదు.
ఉండ నొక్క గుడిసె ఊళ్ళెలేదు.
కూర బువ్వ బుక్కకుడువ లేదు
కడుపు నింద గంజి గటక దినక.
పరుల పంచె లందు పస్తులుండి.
పచ్చు లోలె జంట బాయ కుండ.
కూలి నాలి జేసి కూడ బెట్టి.
గూడు గట్టు కొనియు గువ్వ లోలె.
పాలు నీళ్ల వోలె పాన మోలె.
కన్ననొక్క నలుసు కంటి వెలుగు.
కంటి రెప్ప వోలె కాచు కుంటు
పాన మోలె పెంచి పెద్ద జేసి.
సదువు సందెలెల్ల సదివి ఎదిగె.
చక్కనైన చుక్క చనువుజూసి.
పెళ్ళి జేసి నాము పేర్మితోడ
కొన్ని నాళ్ళుగడువ కొడుకు తన్ని.
తగుల బెడుతనంటు తగవులాడి.
అంతనాదెఆస్థి అంటుఉరిమె.
దిక్కు ఉన్న నింక దిక్కు ఎవరు?



-డా.జనపాల శంకరయ్య.
8074727108.

తృతీయ

## గెంటవలయు వ్యాధి నింటనుండి

కోవిడనెడి వ్యాధి గోళ మంత!
కారు చిచ్చు వోలె కమ్మి వేసె!
పిల్ల పెద్ద లెల్ల భీతి చెంద!
చుట్టు ముట్టి వేసె మట్టి కరుప!

మనిషి-గొడ్డు తేడ మరచి పోయి!
వింత వింత తిండ్లు వెగటు లేక!
గబ్బిలాలు తినెడి గబ్బు జాతి!
జబ్బు పాలు జేసె జగతి నంత!

ప్రళయ మొచ్చె నంచు భయము జెంద!
తల్లడిల్లి పోయె ధరణి యంత!
ఇల్లె జైలు కాగ యెల్ల జనులు!
లాకు డౌనయితిరి రామ! రామ!

ప్రభుత నడుము కట్టి పథము జూప!
యెల్ల రంగములను హెచ్చరించె!
యుద్ధ ప్రాతి పదిక యుక్తి పన్ని!
వ్యాధి వెడల గొట్ట ప్రతిన బూనె!

వైద్య బృంద మెల్ల వేల్పు లౌగ !
ప్రాణ మొడ్డి సేవ పంచి నారు!
రక్షక భటు లెల్ల రాత్రి పగలు!
విధులొనర్చి నారు వీరు లనగ!

మాయ దారి జబ్బు మంది కంటె!
మందు గింటు లేదు మృత్యు వేను!
ఒకరి కొకరు యెడము నుండ గాను!
గెంట వలయు వ్యాధి నింటనుండి!



- కుసుం కుమారి ఉప్పలపాటి
9705009254

# ఆగష్టు నెలలో...

ప్రథమ

## అమ్మ

పా//వె// కటువుమాటలాడ కలహమేర!
సరసభాషణమ్ము సర్వహితము
ఒక్కమాటతోటి ఒరుల గెలువ
మాట విలువదెలిసి మసలుకొమ్ము

పా//వె// కాచలేనుయనదు కన్నతల్లి
మోయలేనుయనదు మోదు లతను
బంధమెప్పుడున్ను భారమనక
తీగ కాయనాపు తిన్నగాను

పా//వె// నేర్పవలెను విద్య నేర్పుతోడ
సాధ్యపడనిదేది సాధనమున
పట్టుదలనుబట్టి ప్రగతినొంద
సాలెపురుగు మనకు సద్గురువుర

పా//వె// చిన్న నవ్వు తోటి చింతదీరు
తగనివేళ నవ్వు తగవుదెచ్చు
పాండవులకు పత్ని ఫక్కుమనగ
రాజ్యమంతయున్న రణముసాగె

పా//వె// పరుల కుశలమడిగి పలకరించ
సాయమందజేసి సహకరించ
గుండెలోన నిల్పి గుప్తముగను
దైవసముడివౌదు ధరణిలోన

పా//వె// పిడికెడన్నమడుగు పేదవాడు
ధనపురాశులడుగు ధనికుడున్ను
ఇవ్వగలుగువాడు ఇడుములనుట
కాలమహిమగాను కానిపించె

పా//వె// పల్లెటూరు విడిచి పట్నమొచ్చి
కూలిపనులు లేక కుమిలిపోయె
కలతజెంది బతుకు గడపనేల?
కాడవీడు సుమము కళనుదప్పు

పా//వె// వేశ్య వృత్తియనుచు వెక్కిరించి
తనువునమ్ముకొనుట తప్పుబట్టి
దారిజూపుమనిన దరికి రాక
చిన్నబుచ్చువారె చెడ్డవారు

పా//వె// వీణతీగ మీటు విద్యనేర్వ
మనసుహాయినొంది మధువులొలుకు
తరుణి పాడుచుండ తంత్రి మీటి
వినగ స్వర్గమోయి వీణపాట

పా//వె// అమ్మ ప్రేమ కొలువ ఆకసమ్ము
అమ్మ చేతిముద్ద అమృతసమము
కష్టపెట్టకుండ కాచుకొనగ
యజ్ఞ సమముయైన యశముగల్గు



-గుడిపూడి రాధికారాణి,
ఫోన్: 9494942583

ద్వితీయ

## వైద్యోనారాయణోహరిం

పాడు రోగ మొకటి పట్టి పీల్చ
ఎల్ల లోక మెల్ల ఎట్లు బ్రతుకు
దేవుడంచు నమ్మి దేహియన్న
కాదు కూడదంచు కసురు కొనును

డబ్బు మాట దప్ప దాన మేది
పేద ప్రాణ మన్న పేర్మిలేదు
ఆసుపత్రు లన్ని యముని సమము
మార్చలేము వారి మనసు మనము

తరతరాలు తినిన తరగని నిధి
కూడబెట్టు కొనును కుదురు గాను
దాన గుణము లేని ధనము యేల
లోభి వైద్యుడగుట రోత సుమ్మి

చచ్చినట్టి వాని శవము నీయ
అధిక కాసు లడిగి యాగి చేయు
దైవదూత లనుట తగదు తగదు
డబ్బు మనుష లనుట తగును నిజము

పరుల సేవ గోరి పనులు జేయ
దేవుడనగ మీరె దేశమందు
మంచిపేరు తోడ మహిన వెలుగ
ఇంతకన్న సేవ నిలను లేదు



-దామరకుంట శంకరయ్య
9440876788




ప్రసిద్ధ కవి "పాటవెలదుల' సృష్టికర్త
డా|| వడ్డెపల్లి కృష్ణ
మరియు
నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో

## ప్రతినెలా ఉత్తమ "పాట వెలదుల"కు బహుమతులు

ప్రతినెలా ఉత్తమ పాట వెలుదల్ని రచించిన రచయితలకు
**ప్రథమ బహుమతి1,116/-,**
**ద్వితీయ బహుమతి750/-,**
**తృతీయ బహుమతి 500/-లతో పాటు**
**ప్రశంసాపత్రం** అందజేయబడును.

'పాట తవెలదుల'లక్షణం: ప్రతిపాదంలో 4 పాదాల్లోనూ 5 సూర్యగణాలు హంస పంచకం ఉండాలి.

అంటే "ఆటవెలది"లో 2వ, 4వ పాదంలో పాటించే హంస పంచకాన్ని అన్నిపాదాల్లో పాటించాలి.

5 సూర్యగణాల మాత్రలనిడివి15 మాత్రలు.
మాత్రాగణనం 'పాట' లక్షణం.

హంస పంచకం 'ఆటవెలది'లక్షణం.
ఈ వినూత్న పద్య ప్రయోగానికి "పాటవెలది" అని పేరుపెట్టనైనది.

*'పాట వెలది' పద్య ఉదాహరణకు:*
**"పల్లెలందు వీచు పైరగాలి**
**పట్నమందు లేచు పాడుగాలి**
**ప్రియముగాను మనిషి పీల్చుగాలి**
**కలుషితమ్ము ఆమె కర్మగాలి"**

ఇలా కనీసం 5 పద్యాల్ని రచించి 'నేటినిజం' పత్రికకు ప్రతినెలా **20వ తేదీలోగా** పంపించాలి. ప్రతినెల నెలాఖరులో ఫలితాల్ని ప్రకటించి రచయితలకు బహుమతుల్ని నేటినిజం వేదికగా అందజేయడం జరుగుతుంది.

సందేహాలకు డా|| వడ్డేపల్లి గారిని 9246541699లో సంప్రదించండి.
రచనలు పంపవలసిన ఈమెయిల్:
E-mail : netinizam2020@gmail.com


తృతీయ

## విలువ

అక్షరములు నిలన రక్షనిచ్చె
జ్ఞాన బోధ చేయ జగతి లోన
కలముకున్న శక్తి కత్తికేది
విద్య నేర్చుకున్న:విలువ పెరుగు.!

తెలుగు వెలుగు నంత తెలుప గాను
అడుగుపెట్టె గురువు యవని యందు
బుద్ది నేర్ప గాను దిద్ది చూపి
విద్య పంచె గురువు విలువ యెరిగి.!

తెలుగు భాష ఘనత తెలుప కదిలె
అన్య భాషనైన యాదరించె
కృషిని సలిపె బ్రౌను రీతి గాను
కావ్యములను మనకు:కానుకివ్వ.!

చేయు కష్ట మింక చేను లోన
పాడి పంట పండ ప్రాణ మొచ్చె
పచ్చ శోభ నిచ్చె పసిడి పొలము
అందముగను వొప్పు యవని యందు .!

అన్నదాత నిలన యాదరించ
వేయు పంటలెన్నొ చేయు శ్రమను
హలము చేతబట్టి పొలము దున్న
పండు పసిడి పంట పచ్చగాను..!



-సునీత బండారు
9440671530

## చానకాలం తర్వాత. ...

చానకాలం తర్వాత నా పాదాలు అటువైపు కదిలాయి. .
వానాకాలం ముసురువానల్తో పెదవాగు నదిలా మారింది
ఉరుకుల పరుగుల స్వచ్ఛమైన గంగానదిలా మారింది ...
నదీ సంగమానికి నిముసమాగక గలగలలా పరిగిడుతుంది..
ఎన్నో మలినాలను,అక్రమాలను అది తుదిమొదలు తుడిచివేసింది..
కోపంతో మునుపటి దారులన్నింటిని అన్నిదిశలా మూసివేసింది
పాముపంకల క్రొత్త కాలిబాటల్ని
మరల కోటి ఆశలమనిషి చీమల్లాగా నడిచి వేసుకుంటున్నాడు
పొమ్మన్నాపోలేడు మనిషి నీళ్లను,కన్నీళ్లను బహుశ విడిచి ...
బెల్లం చుట్టూ ఈగలు మూగిన మాదిరి
వాగువరద ఇసుకమేటల చుట్టూ ట్రాక్టర్లు ఆగాయి
గ్రామస్తుల రాకపోకలతో గంగపుత్రుల సందంట్లో
నా పాదాలు నిదానంగా కదులుతున్నాయి...
పాదాలతో బాటే కొన్ని వాక్యాల పాదాలూనూ...
వాగుపొంగుకు దరులొరసిన
నీళ్లకాలువ అడ్డంగా అందంగా వెలసింది...
అడుగులుపెట్టగానే నువ్వెందుకు రావట్లేదని తట్టినట్లైంది నాకు..
ఇంకాస్త ముందుకెల్లంగా చిరుశిలలు రాలగుత్తులుగా గమ్మత్తుగా
మౌనరాగాన స్వాగతం పాడాయి...
మరల నదంచులో విశాల ఇసకఎదలో
చిన్నరాళ్లు చిత్రంగా కొలువై అనురాగాలు ఒలికాయి..
ఇసకల చెమ్మలో చెదరని నత్తల తెలియని గీతల రాతలు...
వాటిలో ఇమిడిన తత్త్వాలు చదవమన్నాయి నా పాదాలను...
రాలహృదయాలు,ఇసుకతీరాలు,
వికసిత తరువు తాజహరితసోయగాలు,
వాగువంపుల వయ్యారపు నడకలు. గవ్వలు,గువ్వలు అలలు,గాలివలలు...
వగైరా మానవ మనుగడకు అన్వయమే అంతా, అన్వయం కాకపోతేనే వింత...
ఆ పై నా పై విశాల ఆకాశం భాస్కరునితో భాసించే అంతా...
పులకింతలే నా మనసంతా....
నా ఆలోచనలు మల్లెతీగలై పులకరింతల నా మనసునల్లెను
అదిగో అటువైపో మరో పాయ ఇది పెదవాగు పెద్దమాయ..
ఇటుతీరం అందం.. అటుపెదవాగు హోరందం..
ఏరు ఏరు నడుమ ఎన్నారు( ఔ.ఖీ=నల్లగొండ రమేష్)
నా పై అనంతాకాశం నుండి దేవతలు శుభమని అన్నారు...
అందాలెన్నింటినో పొదువుకుని
గుండె హాయిగాచేసుకుని వెనుతిరిగాను తిన్నగా....
అదిగో అటువైపు అమ్మనాన్నల్తో
కొంగ్రొత్త పరవళ్ల పెదవాగువంటి కన్నెపిల్ల
ఆ పరవళ్లు కళ్లజూసి నవ్వుల్ని దూసింది...
మరో ఆరడుగుల దూరంలో గణపతిబొప్పా మోరియా అంటూ
యువకుకులు సెల్ఫీల లీలలు ఈలలు.
దాన్నిచూసి గంగపుత్రుల పిల్లలు కాదు
చేపపిల్లలై కేరింతలు తుళ్లింతల్ని రెట్టింపు చేస్తున్నారు
ఆ వాగు ఒడిలో నాభిదాటిన....
నీళ్లనుండి.గోలగోలలు..
ఒక యువకుడు నడుస్తూ నడుస్తూ
వాగులోకి వస్త్రాలు బాహుబలివోలే చేతబూని
భుజాలవరకుమాయమై నాలుగునిముషాల్లో ఆవలిగట్టున వాలి
పయనమైన మాయాజాలం
తనపెనిమిటి బుట్టలో మాపటి కూరుకు చేపల్తో వెలుతున్నాడని
సంబరపడుతుందో పడతి గట్టుపై ఈ సంధ్యాకాలం...
మురికినంతటిని ఉతుకుతున్నారు కొందరు మగువలు ముచ్చట్లతో మురిపెంగా....
లోకం మకిలీనంతా ఉతికితే బాగుండని అనుకున్నా లోలో..

పాదాలు ఆగమంటున్నా ఆగకుండా తీరం దాటాను
కొన్ని మరణాల్ని,కొన్ని దారుణాల్ని,
కొన్ని సొగసుల్ని మరికొన్ని పసి మనసుల్ని దాటాను...
నమశివ్వాయంటూ...
తీరం దాటాను...చానాకాలం తర్వాత.



-నల్లగొండ
83094532179

## నేటిభారతం తెరతీసి చూడగా!

కమిలిన గుండెలు
కూలిన ఆశలు
ఉబికిన కన్నీటిదారలు
కుమిలిన మనసులు
కరువుల వరదలు
గతుక్కు బ్రతుకులు
బితుకు బితుకు దారులు!
ఆకలి కేకల్ని ఎత్తి పొడిచే
కాసుల లోకం కాకులు!
చిరిగిన బట్టలు
చెదిరిన జుత్తులు
విసిరిన పెంకులు
వీధిబాలలే కార్మికులు!
ఎగిరిన జెండా...
వల్లించిన ఎక్కాలు
అహో అభివృద్ధి లెక్కలు
చవి చూడగా అడుగడుగునా
అడుగంటిన బీదలడొక్కలు!
ఎక్కడకక్కడే పొగడ్తలు
రహదారి పొడుగునా...
డిజిటల్ మొక్కులు
కాకా రాజకీయాలు
మూతతీస్తే కుళ్ళిన పాలనలు!
గాంధీ బొమ్మల కాగితాలు
కరుణ మరిచి
వడ్డీలు పిండిన రోకళ్ళు
ఆకలిబాకుల బలహీనతలే
వ్యాపార అడ్డాలు
వందకు వంద వడ్డీలు

ధర్మమే కదా అంటున్న
మానవత్వం వదిలిన
మనుషుల మృగములు!
అమ్మకు బంగారు తాళి
అజన్మాంత కోరిక
తీరేదెప్పుడు తీర్చేమార్గం ఏది!
చిత్తు కాగితాలు
ఎగిరిన చోట చుట్టూ
కోకొల్లలైన చేతులు
బిక్కసచ్చి పోతున్న
అక్షరాస్యతా లెక్కలు!
మతాలు ముసుగులు
కులాల కుట్రలు
మాయమాటలు
ప్రలోభ మూటలు
ఓటింగ్ రోజు తంత్రమంత్రంగాలు
ఇవేకదా నేటిరాజకీయాలు!
పొలాలు నిండా పంటలు
రైతులప్రేగుల ఆక్రందనలు
మధ్య దళారీదారుల
గాదెల నిండా కాసుల రాసులు!
ఎక్కడ వేసిన గొంగళి అక్కడే...
అప్పుడూ ఇప్పుడూ
పల్లెలకు పరాభవాలే!
పట్టణాలకు పట్టని

చైతన్య బాటల భాసలు
నగరం నవనాగరిక అయోమయం!
ఎప్పుడు ఆడది నిర్భయంగా
రాత్రీ ఒంటరిగా నడుచునో
అప్పుడే స్వాతంత్ర్యమని
నుడివెను గాంధీ...ఇప్పుడు
చవకబారు బ్రాందీ సాక్షిగా...
పగలు కూడా...
ప్రధాన రహదారిపై....
వస్తూ పోలేని మహిళామణులు!
చిక్కటి మాటల
ఎన్నికల అజెండాలు
చక్కని పలుకుల
నేతలు చిలుకలు
రాత్రికి రాత్రి చిల్లర పంపిణీ...
గుద్దురా గుద్దు...
నోటిచ్చిన నేత గుర్తుమీదే...
ముద్ర గుద్ది గెలిపించు!
కక్క...చుక్క నోటుముక్క
ఓటే వేసేవాడి లెక్కేవేరు ఆరోజు!
రాచకీయమే లాభసాటి
పైసాకి పదిరూపాయలు
ఆ జెండా కాకపోతే...

ఈ జెండా నీడలో...
ఎజెండాయే లేని ప్రభుద్దులు
పార్టీ మారినోళ్ళూ మహాత్ములే!
మధ్య మధ్యలోనే...
మధ్యతరగతి ముస్తాబు
గోచీకి ఎక్కువ
గావాంచకు తక్కువ
ఎక్కువ తక్కువ తక్కెడ
త్రిశంకు స్వర్గంలోనే
తెల్లారిపోతున్న మహాభారతం!
సిపాయి తూటాపేలితే...
నేతకు పండగ...
లాజిక్ లేని ఈ మేజిక్కులో...
మనదే ప్రపంచరికార్డు
నిజం నిష్ఠూరం...
అబద్ధం అమోఘం
సోషల్ మీడియాలోనే నీతులు
పక్కవాడు చావుకేకలు
మనవాడికి సెల్ఫీ సంబరాలు!
చుట్టూ అవినీతి సముద్రం
బిక్కుబిక్కుమంటూ...
ఒకటో... రెండో మంచినీటి
సరస్సులు సర్వ యశస్సులో...
చీకటిదే సింహభాగం!

-మీగడ వీరభద్రస్వామి
7893434731

## ధర్మ సూత్రం?!

కరోనా ప్రాణాలు తోడేస్తుందని...
వరదల ముప్పు ముంచేస్తుందని?
గుండెలు బాదుకున్నంతనే...
అపరాధ కొండలు పిండిబారవు

కన్నీటి శోకం ఒలికినంతనే...
పాప "పంకిలం" పవిత్ర జలమవదు

నెపం పక్కకు నెట్టినంతనే...
అన్నెం పుణ్యమై వన్నెలీనదు

ఏ మాటకు ఆ మాటేగాని...
మనిషిది మాత్రం సచ్చీల బాటనా ?
అంతా తప్పటడుగుల నడకే కదా !

తరాల వారసత్వం నెత్తినెత్తుకు...
ఎన్ని వికృతాలకు తెగబడ్డాడు.. !?
అడవిని అన్యాక్రాంతం చేసాడు ...
పుడమిని "ఎడారి"గా మిగిల్చాడు...
జీవ జాతుల "నిర్వీర్యం" గావించాడు..
జలాల కాలుష్య "కాసారం"గా మార్చాడు

చెట్టు,పుట్టా, కొండా కోనలు,
వేటిని వదలక "చెర" బట్టాడు

కన్ను మిన్ను కానక తప్పిదాలకు తెగబడితే...
గాయపడ్డ ప్రకృతి గుండె ఘోషిస్తుంది
కడుపు మండి శాపనార్థాలు గుప్పిస్తుంది

ఇదుగో శాపాల ప్రతిఫలమే...
ఈ కరోనా కష్టాలు...
ఈ అకాల వైపరీత్యాలు...

తప్పు చేసినా వాడేవడైనా?
మూల్యం చెల్లించాలన్నది ధర్మ సూత్రం

అందుకే....!
మనిషి తప్పిదాలకు...
ఫలితం అనుభవించక
తప్పదు మరీ...!



- కోడిగూటి తిరుపతి
9573929493

## వృద్ధులు

సూర్యుడు ఉదయించి
ప్రచండంగా వెలిగి
సాయంత్రం వేడితగినట్లు
వయసు పెరిగి శక్తి తగ్గి
అనుభవమున్నా, వృద్ధులని
పిల్లల నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటూ
సంధ్యాకాలంలో
బతుకుతున్నవారు
ఈపిల్లలకు బతుకు నేర్పినవారు
కష్టంలో ఓదార్చినవారు
వారి అభివృద్ధికి సోపానం వేసినవారు
వేలుపట్టుకుని నడక నేర్పినవారు
మర్రివృక్షం బరువును వూడలు కూడా మోసినట్లు పిల్లలు,
వృద్ధులకు చేదోడు వాదోడుగా వుండడం మరిచారు
పిల్లలకు కాలిలో ముల్లు గుచ్చుకుంటే
పెద్దలకు కంట్లో నీరు కారుతుంది
పూలపాన్పులపై పడుకోబెట్టి
చేతులపై ఎత్తుకుని
పెంచి పెద్దచేసారు
అవన్ని మరచిన పిల్లలు,
పెద్దలపై కాస్త
ప్రేమ చూపించలేక పోతున్నారు.



-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

## చినుకు - సృష్టి

నెరలు విచ్చిన నేల పొరల్లో
ఇరుక్కున్న విత్తనపు గొంతులోకి
ఒక్కొక్కటిగా జారిన చినుకులు
కొత్త జీవానికి పురుడు పోశాయి.

కొమ్మల చేతులు పైకి చాచిన చెట్లన్నీ
చినుకుల స్నానంతో పులకించి
చిగురుల చొక్కాలు తొడుక్కున్నాయి.
చినుకు సందడి వినగానే రైతన్నలు
క్షేత్రాలను ముస్తాబు చేసుకుంటున్నారు
చినుకుల్లో తడిసిన చిన్నారుల కేరింతలు
నేల పైన హరివిల్లులై విరుస్తున్నాయి.
మెరుపుల కాంతులలో పడుచు జంటలు
సిగ్గుల గొడుగులు కప్పుకుంటున్నాయి.

మండే ఎండల్లో కడలి నుంచి ఆవిరై
మేఘాల్లో దాగిన జలసంపద
ఏ చల్లగాలి మెల్లగా గిలిగింతలు పెట్టిందో మరి
మబ్బులన్నీ కరిగి కురిసిన చినుకులు
కొండల్లోంచి మెల్లగా క్రిందికి
సెలయేరులై పారుతున్నాయి
జలపాతాలై దుముకుతున్నాయి
నదులుగా నవవధువులై
మైదానాల్లో పంటబిడ్డల్ని కని
జలచరాలకు నిలయములై
తీరాల్లో నాగరికత నిర్మాణం చేస్తున్నాయి
వరదగా సాగుతూ . . కదలి కదలి
మళ్ళీ సింధువుగా మారుతున్నాయి
సింధువు నుంచి చినుకు -
బిందువు నుంచి కడలి
విత్తు నుంచి చెట్టు - చెట్టునుంచి విత్తు
బీజం నుంచి జీవం - జీవి నుంచి బీజం
ఇదే సృష్టి రహస్యం !!



- శ్రీధర్ కొమ్మోజు
9989464467

## దుఃఖపు చినుకులు

చినుకులెప్పుడూ
చిరునవ్వును
మోసుకొని రావాలి
కురిసే ప్రతి చినుకూ
శ్రమ జీవికి చైతన్యం అందించాలి
మా కలల పంటలు నిజమై
మా కళ్ళలో నిలవాలి
నదులు నవ్వుతూ పారాలి గానీ
మా కన్నీళ్లను కలుపుకొని కాదు
అతివృష్టో, అనావృష్టో కాకుండా
ఆత్మీయ అతిథిలా
అమాంతం పలకరిస్తూ రావాలి
మనిషికి వర్షం ఒక వరం
వారధిలానే నిలవాలి
అవరోధాల మధ్య జీవనం
అతలా కుతలం అవ్వకూడదు
చినుకుతో జీవితాలు చిందెయ్యాలి
అవస్థల మధ్య
చింపిన విస్తరి కాకూడదు
రాలే ప్రతి బొట్టూ
పల్లెల్నో ,పట్టణాల్నో పలకరిస్తూ
పులకింతలు పూయించి
పుడమికి పచ్చదనాల
హారతిని అందించాలి
వర్షం ఎప్పుడూ హర్షమే గానీ
మనిషిని చిదిమేసే
దుఃఖపు చినుకులు కారాదు



- మహబూబ్ బాషా చిల్లెం
9502000415

## అవిరామ స్వప్నం

ప్రయత్నాల గుండా
పరుగులు తీస్తున్న
ఆలోచనలు
ఎంతో గొప్ప కోసం

ఉన్నది కరిగిపోతోంది
లేనిది అందుతుందా?

ఏది ఏమిటో
తెలిసే నాటికి
జీవితం ఉండకపోవచ్చు
ఉన్నా ఏమీ మిగలదు

కళ్ళు మూసుకుని
తొక్కుకుంటూ పోవద్దు
ఏరుకుని
మనసులో వేసుకుంటూ సాగు

చివరికి
అబద్ధంగా ఆశ మిగిలితే
ఉన్న నిజమైనా దక్కినట్టవుతుంది



- కళ్ళేపల్లి తిరుమలరావు
9177074280

## నానీలు

ఎండే కొమ్మకు
రాలే అక్షరాలు కాదు
నా భాష విస్తరించే
విశ్వపు కొమ్మ

అమ్మ భాష
కమ్మనైనది
మీగడ పెరుగు గురిగె
వలె ఎప్పుడు తిన్నా

బత్కు కథలు చెప్పే
పెద్రాశి పెద్దమ్మ
అమ్మ ఒడి కాంచి
కాట్లె కాలేదాక

ఎన్నడూ వన్నె
తరగనిది
ఎప్పుడో పొద్దు
పొద్వంగ పుట్టిన నాభాష

అనుబంధాల
పాతాల గరిగె
అవనంతా అల్లుకున్న
నా త్రిలింగ భాష



-వకుళ వాసు
9989198334



# తొలి మలి ఉద్యమాల తొణకని స్ఫూర్తి కాళోజి కీర్తి



## (సెప్టెంబర్ 9వ తేది కాళోజి జయంతి సందర్భంగా....)

– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

కాళోజీ నారాయణరావుగారు వరంగల్ దగ్గరలోనున్న మడికొండలో స్థిరపడినా, మహారాష్ట్రలోని బీజాపూర్ జిల్లాలోని 'రట్టేహళ్లి'లో 9.9.1914 నాడు జన్మించారు. 1917లో మూడేళ్ల ప్రాయంలోనే తల్లిదండ్రులతో మడికొండకు తరలివచ్చారు. రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ కాళే ఆయన పూర్తి పేరు. తండ్రి మహారాష్ట్ర బ్రాహ్మణుడు కాగా, తల్లి కర్ణాటక మధ్వ కుటుంబానికి చెందిన మహిళామణి కావడంతో వీరిది బహుభాషా కుటుంబం అనవచ్చు! 'కాళే' అన్న మరాఠీ శబ్దంతో "కాళోజీ నారాయణరావు"గా పేరు స్థిరపరచుకొని, 'కలేజా' వున్న తెలుగువాడిగా రొమ్ము విరుచుకొని కవితా వ్యాసంగం కొనసాగించారు. కల్తీ లేని అచ్చమైన కవిగా, ముక్కుసూటిగా ముక్తసరిగా మాట్లాడినా, కవిత చెప్పినా ఆయనకే చెల్లింది. నాటి తెలంగాణ విముక్తికై – నేటి ప్రత్యేక తెలంగాణకై గళమెత్తి గర్జించిన ఏకైక కవిసింహం కాళోజీ నారాయణరావు!

"కాళోజి మాటలో కల్తీలేదు, వేమన్న పలుకులో వెలితీ లేదు" అని దాశరథి కాళోజీని ప్రస్తుతించడం గమనార్హం! కాళోజీ జీవితాన్ని సాహిత్యాన్ని విడదీసి చూడలేము. "కవిత్వమే జీవితంగా, జీవితమే కవిత్వంగా బతికిన వ్యక్తి ఆయన. ఉద్యమాలకు ఊపిరిగా నిలిచిన సంఘటిత శక్తి ఆయన. 'షాద్' అనే కలంపేరుతో ఉర్దూ కవిత్వం వ్రాసిన ఆయన అన్నయైన కాళోజీ రామేశ్వరరావు కూడ మంచికవి, విద్వాంసుడు కావడంతో తమ్ముడైన కాళోజి నారాయణరావును పితృవాత్సల్యంతో చూసుకొనేవాడు.

కాళోజీ ప్రాథమిక విద్య మడికొండలో ఉన్నత ప్రాథమిక విద్య (సెకండ్‌ఫారమ్) హైదరాబాద్ పాతబస్తీ కాన్గీబడిలో, హైస్కూల్ – ఇంటర్ చదువు వరంగల్‌లో కొనసాగాయి. ఇంటర్‌లో వుండగా క్షయవ్యాధికి గురియై ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక ఊపిరితిత్తిని కోల్పోయాడు. అయినా తెలంగాణ సాహిత్యానికే పెద్ద ఊపిరిగా నిలిచాడు. హైదరాబాద్ హైకోర్టుకు అనుబంధంగా వున్న 'లా' కాలేజిలో ప్లీడర్ పరీక్ష పాసై, కొంతకాలం ఒద్దిరాజు రాజేశ్వరరావు వద్ద లా ప్రాక్టీస్ చేశాడు. విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాలలో పాల్గొంటూ సురవరం, మాడపాటి, బూర్గుల వంటి ఆంధ్రోద్యమ నాయకులతో పరిచయం పెంచుకున్నారు. రావి నారాయణరెడ్డి, వట్టికోట ఆళ్వారు స్వామి వంటి అభ్యుదయవాదులతో సహవాసం పెంచుకున్నారు. పాతికేళ్ల యువకుడిగా స్వాతంత్ర్య జాతీయ స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహంలో పాల్గొని 1939లో మొదటిసారిగా జైలు శిక్షను అనుభవించారు. తర్వాత 1942లో 'క్విట్ ఇండియా' ఉద్యమకార్యకర్తగా మరోసారి జైలు పాలయ్యారు. మళ్లీ హైదరాబాద్ విముక్తి పోరాటంలో ప్రముఖ పాత్ర వహించి 1947–48 మధ్య మూడుసార్లు 13 నెలల పాటు కారాగార శిక్షను అనుభవించారు.

1948 'పోలీసుచర్య' తర్వాత కూడా కమ్యూనిస్టులు రైతాంగ పోరాటం కొనసాగించడం కాళోజీకి నచ్చలేదు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే పోరాటం చేయటం ఉత్తమమన్న ఉద్దేశ్యంతో రాజకీయరంగంపై ఆసక్తి కనబరచారు. 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేశారు. కాని పి.డి.ఎఫ్.కు చెందిన పెండ్యాల రాఘవరావు చేతిలో ఓటమి పాలయ్యారు. 1958లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి శాసనమండలికి ఎన్నికై రాజకీయ జీవితంలోకి అడుగుపెట్టారు. కాని 1960, 62; 1978లో జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అయినా ఎల్లప్పుడూ ఒకే స్ఫూర్తితో, ఉద్యమకీర్తితో రాణించారు. 1956లో విశాలాంధ్ర (ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు)కై విశాల హృదయంతో సమర్థించినా, పెద్ద మనుషుల ఒప్పందం అమలు కాక, తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే తీవ్రంగా ఖండించారు. 1969లో ప్రజ్వరిల్లిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన కవితల ద్వారా, ఉపన్యాసాల ద్వారా విస్తృతంగా ఉద్యమించారు. కాళోజీ ఉద్యమ శీలానికి కవిత్వమే ఆలంబనగా నిలిచింది. అందుకే ప్రతి ఉద్యమంలోనూ ముందు నిలిచి కవితా గానం చేసేవారు. 1931లో బ్రిటిష్ వారు భగత్‌సింగ్‌ను ఉరి తీసిన సందర్భంగా తన 17వ యేట రాసిన గేయాన్ని కాళోజీ తొలిగేయంగా చెప్పాలి! కాని నేడది అలభ్యం.

కవితా గురువైన గార్లపాటి రాఘవరెడ్డి శిక్షణలో కాళోజీ తన కవితా రచనలకు మెరుగులు దిద్దుకున్నారు. కాళోజీ గారి కవితల్ని గురువుయైన ఆయనే భద్రపరచడం గమనించాల్సిన విషయం!

కాళోజీ పేరు వినగానే గుర్తుకు వచ్చేది "నా గొడవ". 1953లో దేశోద్ధారక గ్రంథమాల వారు మొదటిసారిగా ముద్రించిన యీ కవితా సంపుటి అలంపూరులో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు మహా సభలలో ఆవిష్కరింపబడింది. ఆవిష్కరించిన మహాకవి శ్రీశ్రీ "కాళోజీ నా గొడవ ప్రజలందరి గొడవ" అని వ్యాఖ్యానించి ప్రశంసించారు.

**"పుటుక నీది – చావు నీది**
**బతుకంతా దేశానిది"** – అన్నారు. జయప్రకాశ్ నారాయణ్‌ని 'లోక్‌నాయక్'గా ప్రస్తుతిస్తూ. కాళోజీ జీవితం కూడా అంతే. కాళోజీ జీవితమే ఉద్యమం, ఉద్యమమే జీవితం!

**"అధికృత హింసాకాండే**
**పరిపాలన అయినప్పుడు**
**ప్రతిహింస తప్పదు"** – అంటూ ప్రజా హింసను ఎదిరిస్తూ ప్రతిహింస చేసే వాళ్లను (తీవ్రవాదుల్ని) సమర్థించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటాల్ని ప్రోత్సహించారు.

**"నమ్ముకొని పెత్తనము ఇస్తే**
**నమ్మకము పోగొట్టు కుంటివి**
**కుప్పకావలి ఉండి కట్టలు**
**తప్ప దీస్తివి!"** – అంటూ ఆంధ్రా సర్కారు చేసిన అన్యాయాన్ని ఎత్తి చూపారు. పై మినీ కవితల్ని సౌదామినీ (మెరుపు)లుగా మెరిపించడం కాళోజీ కవిత ప్రత్యేకత! ఒకవిధంగా చెప్పాలంటే, ఇటీవల నవీన ప్రక్రియగా ఆవిర్భవించిన 'నానీల'కు కాళోజీపై కవితలే మాతృకలుగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. మరో శీర్షిక 'ప్రాంతం వాడే దోపిడి చేస్తే'లో–

**"ప్రాంతం వాడే దోపిడి చేస్తే**
**ప్రాణంతోనే పాతరవేస్తం!**
**దోపిడి చేసే ప్రాంతేతరులను**
**దూరం దాకా తన్నితరుముతం**
**దోస్తుగ ఉండే వారితో మేమును**
**'దోస్తే' చేస్తం – ప్రాణం యిస్తం!"** –

అంటూ అన్యాయాన్ని సహించక ముక్కుసూటిగా నొక్కి చెప్పటం, తన మాటల్ని ఈటెలగా సంధించటం కాళోజీ కవితల ప్రత్యేకత! 'నా గొడవ'లో వాడియైన వచన కవితల్నే గాక మొదట్లో వేడివేడి గేయాల్ని కూడ రచించారు వ్యంగ్యంగా–

**"చాపచింపు – సామ్రాజ్యం**
**కోడిగుడ్డు – కోహినూరు**
**..................**
**చాకిరేవు – శాసనసభ**
**సానికొంప – సాధుమఠం**
**ఏద్దైతేం – ఎచట్టైతేం?**
**పోట్లీపడి కొట్టులాడ!"**

ఇలా సూటిగా – వ్యంగ్యంగానూ కవిత చెప్పే నేర్పరి కాళోజీయే! కాంగ్రెస్ నాయకులు గాంధీజీ బ్రతికి వుండగా అత్యంత వినయంగా నటించి ఆ తర్వాత ఆయన మరణానంతరం ఏం చేశారో అధిక్షేపంగా చెప్పారిలా –

**"ఇంకేమి కావాలె? ఇంకేమి చేయాలె?**
**బ్రతికినన్నాళ్లు నిను 'బాపు' అని పిలిచితిమి**
**చచ్చిపోయిన నిన్ను జాతిపిత చేసితిమి**
**......................**
**నీ పేరుతో టోపి నిత్యమైపోయినది**
**నీ సూత్ర భాష్యమే నిలువెల్లదాచినది"** –

మరో కవితలో –

**"నేను ప్రస్తుతాన్ని**
**గతానికి శిఖరాన్ని**
**వర్తమానాన్ని, భావికి ఆధారాన్ని!**
**పాతపరుగు తీస్తున్నది**
**నవత తరుముకొస్తున్నది"** – అంటూ నవతను స్వాగతిస్తూనే తాను గతానికే గాక వర్తమానానికీ వర్ధిల్లే శిఖరంగా నిలిచారు. కాళోజీ ప్రజాకవిగా పేరు గాంచడమే గాక ఉత్తమ కథకుడని కూడ 1940లో అణాగ్రంథమాల ప్రచురించిన 'కాళోజీ కథల సంపుటి'ని పరిశీలిస్తే తెలుస్తుంది. బహు భాషా పరిజ్ఞానియైన కాళోజీ మరాఠీ, ఇంగ్లీషు కథలను ఉర్దూ, బెంగాలీ, ఇంగ్లీషు కవితల్ని తెలుగులోకి అనువదించారు. ఆయన అనువాదాలు కేవలం అనువాదాలుగా గాక అనుసృజనలుగా నిలిచాయి. అందుకే ఖలీల్ జిబ్రాన్ యొక్క 'ది ప్రాఫెట్'కు అనువాదమైన అతని 'జీవనగీత' ('భగవద్గీత'లా)కు ప్రభుత్వ పురస్కారం లభించింది.

జీవనగీత : – 'జీవనగీత'లో కవిత ధారావాహికంగా సాగుతుంది, ఏకసూత్రంగా. ఏకసూత్రంతో ఉంటూనే వివిధాంశాలు ప్రస్తావించబడ్డాయి. అవి 1.ప్రేమ, 2.వివాహబంధం 3.దానం 4.తినడం – త్రాగడం 5. కాయకష్టం 6. సంతోషం – దుఃఖం ఇత్యాదులు 25. ముచ్చుకు ఒకటి –

**'జీవన సాగర యాత్రను సాగించుచున్న**
**మీ ఆత్మ అనెడి నావకు**
**మీ వివేకము చుక్కాని – మీ ఆవేశము తెరచాప**
**చుక్కాని విరిగినచో గమ్యము అన్నది లేక**
**తిరుగులాడు గతిపట్టును! తెరచాపలేకుండిన ఎటు**
**కదలక నావ ఒక్క చోటనే నిలుచును!"** –జీవితకాలంలో భారత ప్రభుత్వంచే 'పద్మవిభూషణ్' అత్యున్నత పురస్కారాన్ని, స్వాతంత్ర్య సమరయోధునిగా తామ్రపత్రం, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా పొందిన ఏకైక ప్రజాకవి. అంతేగాక నవ కవితలకో కాలేజి – కాళోజి!



## ప్రజాకవి కాళోజి



నా భాష,,నా యాస నాదంటూ,నింగికి
ఎగిసిన ఉద్యమ కెరటం,
ఒక్క సిరా చుక్కతో లక్షల మెదళ్ల ను కదిలించిన
పోరాటం.
తెలంగాణ జీవిత చలన శీలి
నా' గొడవ' అన్నది అతని శైలి
రాజకీయ దురంధరుడు
కలం బలం లోకమైన వైతాళికుడు
నిజాం ముష్కర పాలనకు,
సమాజం కళ్ళు కుతంత్రాలకు
ఎక్కుపెట్టిన అస్త్రం,
లక్ష అక్షౌహిణులైన కాళోజి గళం,
మాతృభాషకు ఆశ
ప్రాణం పోసెను అతని శ్వాస
బడి పలుకుల భాష కాదు
పలుకు బడుల భాష
తెలుగు అన్న ఘనత
పుట్టుక ,చావు నీది బతుకంతా
దేశానిదన్న చరిత.
రజాకార్ల ప్రతిఘటన, పౌరహక్కుల నిరసన
విప్లవమే పరమావధి,
సాధించిన వీరత్వమే తన
పెన్నిధి
పద్మ విభూషణుడు,తెలుగు భాషా భూషణుడు
చైతన్య ప్రజాకవి, కాళోజీ అమరజీవి.



–సముద్రాల శ్రీదేవి
9949837743

## మనసు

ఎవరికి కావాలి నీ మనసు
కట్నం తీసుకోలేదని
అమ్మానాన్నలకు కోపం
అడిగినా కొనలేదని
ఆలికి కోపం
సినిమా చూపించలేదని
పిల్లలకు కోపం
చిన్న తప్పుకే కస్సుమనే
బాసుకు కోపం
అడిగినా సాయం చేయలేదని
ఫ్రెండుకు కోపం
రోజుకో బొమ్మ కొనలేదని
మనవడికి కోపం
'ఇది తప్పు' అని చెప్తే
పెద్దలకు కోపం
నమ్మి చెడితే
నీమీద నీకే కోపం
కోరిన కోరిక తీరలేదని
దేవునిపై కోపం

ఎవరికీ అక్కరలేని నీ మనసు
దేవునికర్పించి చూడు
ఏ కోపమూ నిన్ను బాధించదు
చెప్తున్నా విను..



– ప్రొఫెసర్ సువర్ణ అలివేలు,
9866075231

## నీ రాక గుణపాఠం

అమ్మమ్మ చెపుతున్నప్పుడు
అర్థం కాలే
బామ్మఅరిచి గీపెట్టుకున్నా వినలే
తాతయ్య రారా భూమి కొలతలునేర్చుకో
బువ్వ దొరుకుతుంది
అన్నా వినలే
ఊరూ వాడా, చేనూ చెలకా తిరిగి తిరిగి వచ్చి, తిని
మళ్ళీ తిరగడం కోసం బయటకు పయనం.
నిత్యం ఇదే పని
ఇష్టం అనిపించిన రోజు బడి
లేదంటే ఇంటికి పక్క హనుమాన్ గుడి.
నా చుట్టూ నాలాంటి జనం,
అప్పుడు నేను మూకసేన నాయకుడను.

పొలాలు, చెలకలు,
మోటబావి కాలువ నీరు
పచ్చని పంటపొలాలు,
మన చెలకలో వేరుశెనగ పంట ఉన్నా
పక్కవాడి చేలో శనగకాయ రుచి వేరు
అమ్మమ్మ చెప్పినా వినలే
బామ్మమాట చెవిన పెట్టలే
తిరిగి తిరిగి నగరం చేరిన నా జీవికి
ఎక్కడ వెతికినా
కమ్మని మట్టి వాసన కరువు
చల్లటి చెలిమె నీరు కరువు
చల్లటి గాలి కరువు
మంచిమాటకరువు
మంచి తోడు కరువు
మనుషుల్లో మనసు కరువు
భోగభాగ్యాల భాగ్యనగరం
అన్నీ కరువే.

నన్ను నేను తెలుసు కునే లోపు,
నేను ఏం చేస్తున్నది తెలిసే లోపు
ప్రకృతి ప్రళయం మొదలు
నాలో ఉన్న మనిషిని వెతికితే
నా చుట్టూ ఉన్న పరిసరాలను చూస్తే
నా స్వార్థం కోసం నేను చేసిన తప్పు లేన్నో
దేన్నీ వదలలేదు
అన్ని నా స్వార్థం కోసం నాశనం చేశాను
అద్దాల మేడల మధ్య
అబద్దాల జీవశ్చవాన్ని
నాకు నేనే గొప్ప అని
అన్ని నాకే తెలుసు అని
విషపు ఆలోచన తో
భూమిని, నీటిని, గాలిని
మనసు లోని ఆలోచనలను
మనిషికి, మనిషి కి మధ్య
బంధాలను దూరం చేసిన వాడ్ని
నేను నేను గా ఉండనందుకు
నాకీ శిక్షఅవసరమే
నీ రాక మేలుకొలుపు
నీ రాక ఓ జీవితకాలపు గుణపాఠం
నేను మారుతా
నీకోసం కాదు
నాకోసం
నా ముందు తరం కోసం
మన్నించి వెళ్లి పో
మళ్ళీ రాకు
నీకు ఆ అవకాశం ఇవ్వను
ప్లీజ్ కరోనా వెళ్లిపో
వెళ్ళిపో.. వెళ్ళిపో..



–పరాంకుశంనారాయణరావు
9908229221

## తల్లీ కూతుళ్ళు

అమ్మ
పక్కన లేనప్పుడు
పనులన్నీ చక్కబెట్టుకునే కూతురు
అమ్మని చూడగానే
పనులన్నీ పక్కన పెట్టేస్తుందెందుకో
అమ్మ చేస్తుందిలే అని కామోసు!

అయ్యో, నా కూతురు
ఎంత కష్టపడుతుందో
కాలు కిందపెట్టనివ్వలేదు
చేతులు కందనివ్వలేదు
అనుకుంటూ
అదేదో తనని ఉద్ధరించడానికే
కూతురు మనువాడి, నీళ్ళోసుకుని
మనవల నిచ్చినట్టు, మురిపెం
నా కూతురే కదా అంటూ ఊడిగం

తను కూతురి దగ్గరకి వచ్చినా
కూతురు తన దగ్గరకి వచ్చినా
తనదే బహుపాత్రాభినయం
వంటమనిషి, పనిమనిషి,
చాకలి, మంగలి
ఇంకా ఎన్ని అవసరాలుంటే అవన్నీ

అదేదో అద్భుత అవకాశమన్నట్టు
ఉప్పొంగిపోతూ
చిరునవ్వుతో చక చకా చేసుకుపోతుంది
బుజ్జాయిగా ఉన్నప్పుడు
ముస్తాబు చేసినట్టు
తలదువ్వి,
తన కూతురంత బంగారం లేదన్నట్టు మెటికలు విరుస్తుంది

మనసు విప్పి ఏదో మాట్లాడుతుంటారా
ఒడిలో పెట్టుకుని జో కొడుతుంటారా
అల్లుడు రాగానే
ఏమీ తెలీనట్టు
మీ వారికేమి కావాలో చూడవే
అని పక్కకి తప్పుకుంటారు
కన్న తమకు లేని అధికారం
కట్టుకున్న అతనికి దారాదత్తం
అప్పటికి ఇంటిలోని మార్పులు
ఆయనకేమీ తెలీనట్టు

ఈ తల్లులున్నారే
ఎప్పటికీ మారరు
కూతుళ్ళు అంతకన్నా
తల్లి పాత్ర వరిస్తే తప్ప

అవును
అమ్మ జీవితం
దేవుడు ఇచ్చిన
బ్లాంకు చెక్కు
ఎంతైనా వాడుకోవచ్చు!



–ఉప్పలపాటి లక్ష్మీ ప్రశాంతి
9885026676




కిన్నెర ఆర్ట్ థియేటర్స్



కిన్నెర ఆర్ట్ థియేటర్స్, నేటినిజం తెలుగు దినపత్రిక, మరియు పి.వి.మనోహరరావు గారి సౌజన్యంతో
భారత పూర్వ ప్రధాని పి.వి.నరసింహారావు గారి శత జయంతి సందర్భంగా




పి.వి.నరసింహారావు
జీవితం- వ్యక్తిత్వం- సాహిత్యం ఇతివృత్తంగా

వ్యాస రచనల పోటి

ఉత్తమ బహుమతి : రూ.5000/-
ద్వితీయ బహుమతి : రూ.3000/-,
తృతీయ బహుమతి : రూ.2000/-

- రచనలు ఎ4 సైజు పేపరులో 4 పేజీలు తగ్గకుండా/ మించకుండా ఉండాలి.
- వ్యాసాలు ఏ పత్రికలో ప్రచురించలేదని సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని, ఈ పోటీ నిమిత్తమే వ్రాసినదని, హామీ పత్రం జతచేయాలి.
- హామీ పత్రంలో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా, సెల్ నెం.తప్పనిసరి.

రచనలు పంపిలసిన చిరునామా:
నేటినిజం దినపత్రిక,
ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్,
అశోక్‌నగర్, హైదరాబాద్-20
netinizam2020@gmail.com

రచనలు పంపవలసిన చివరి తేది
30-09-2020


## యాదికొచ్చిన కాళోజీ

పలుకుబడుల భాష కావల్నని
పంతం పట్టిండు
అన్యభాషలొచ్చి తెలుగు రాదన్నోన్ని
చావుమన్నడు
భాష మీద పావురంతోని ప్రజలకోసం
గ్రంథాలయాలు పెట్టిండు
ఎవలో ఏమో అనుకుంటరని మనం
మన యాస మరువద్దండు
మట్టి మీద మమతతోని రజాకర్లతో
లడాయి జేసిండు
ధర్మం మీద దండిభక్తితోని వరంగల్లుల
గణపతుల పెట్టిండు
గాంధిబాటలోనే నడిచిన ఎదురుదాడికి
ఎనుకాడనోడు
మనోడే మనల్ని మోసం జేస్తే మట్టిల
బొందపెట్టమన్నడు
లక్షమెదళ్ళు కదిలియ్యడానికి ఒకే ఒక్క
సిరాచుక్క చాలన్నడు
పుట్టుక నీది-చావు నీది- బ్రతుకంత
దేశానిది అని చెప్పిండు
ఎన్ని ఇనాంలొచ్చినా- ఎంత అణుకువ
ఎన్నో వైలు రాసినా- ఎంత మెలకువ
పొద్దుగాల్నే యాదికొచ్చిన ఆయనే
మన తెలంగాణ"గొడవ"కాళోజీ
మన తెలంగాణ"జీవనగీత"కాళోజీ

-సామల కిరణ్,
9949394688

